

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 344 | హైదరాబాద్ | శుక్రవారం | 22-05-2026 | పేజీలు: 08




## బండి భగీరథ్ కేసులో కొత్త ట్విస్ట్..

కీలక ఆధారాలు
మాయం చేశారనే ఆరోపణ
IPC సెక్షన్ 238
అదనంగా చేర్చిన పోలీసులు
డిజిటల్ ఆధారాల
తొలగింపుపై దర్యాప్తు
పాత ఫోన్లు, సిమ్‌కార్డులు
మాయం చేసినట్లు అనుమానం
ఇతర కీలక ఆధారాలు
తొలగించినట్లు సమాచారం
ఆధారాల నాశనం కేసులో
కీలకంగా మారిన అంశం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

బండి భగీరథ్ కేసులో మరో ట్విస్ట్ నెలకొంది. ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకుంటామని హైకోర్టులో బండి భగీరథ్ లాయర్ మెమో ఫైల్ చేశారు. భగీరథ్ అరెస్ట్‌కు ముందు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న హైకోర్టు తీర్పు ఇవాళ

..మిగతా 2లో

# రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు

తెలంగాణ సమాజం ఆయనకు రుణపడి ఉంది
వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు
సాంకేతిక విప్లవానికి మార్గదర్శకుడిగా కొనియాడిన ముఖ్యమంత్రి
కంప్యూటర్, ఐటీ, టెలికామ్ రంగాల ప్రవేశానికి కీలక పాత్ర
మహిళా సాధికారతకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు
తెలంగాణ సాధనలో సోనియా గాంధీ పాత్రపై ప్రశంసలు
మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు
బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్
కాంగ్రెస్ నేతలతో కలిసి విగ్రహానికి నివాళులర్పణ
యువత, అభివృద్ధి, డిజిటల్ ఇండియా దిశగా రాజీవ్ ఆశయాలు
దేశ నిర్మాణంలో కాంగ్రెస్ కుటుంబ త్యాగాల ప్రస్తావన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

దేశ అభివృద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవానికి పునాది వేసిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. కంప్యూటర్, ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాలను భారతదేశానికి పరిచయం చేయడం ద్వారా దేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. గ్రామీణ భారతాన్ని సాంకేతికతతో అనుసంధానం చేయాలన్న ఆయన ఆలోచనలు నేటి డిజిటల్ ఇండియాకు మార్గదర్శకంగా నిలిచాయని వివరించారు.

రాజీవ్ గాంధీ యువతపై అపార విశ్వాసం ఉంచారని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మిన నాయకుడిగా ఆయన నిలిచారని

..మిగతా 2లో



# NH-44 పై భారీ ప్రమాదం.

తూప్రాన్ వద్ద
కంటైనర్‌లో
అకస్మాత్తుగా
మంటలు
మంటల్లో
కాలిపోయిన
8 సరికొత్త కార్లు
NH-44 పై
భారీ ట్రాఫిక్ జామ్
షార్ట్ సర్క్యూట్
కోణంలో దర్యాప్తు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

మెదక్ జిల్లా తూప్రాన్ వద్ద జాతీయ రహదారి 44 (NH44) పై గురువారం ఒక ఘోర అగ్నిప్రమాదం జరిగింది. రోడ్డుపై వెళ్తున్న ఒక పెద్ద కంటైనర్ లారీలో అకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగడంతో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. దట్టమైన పొగలు, మంటలతో హైవేపై ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. కామారెడ్డి నుండి హైదరాబాద్ వైపు కొత్త కార్ల లోడ్‌తో వెళ్తున్న ఒక కంటైనర్ లారీ తూప్రాన్ పరిధిలోకి రాగానే ఈ ప్రమాదం జరిగింది. లారీ కేబిన్ భాగం నుండి మొదలైన మంటలు క్షణాల వ్యవధిలోనే కంటైనర్ మొత్తం విస్తరించాయి. ఈ ప్రమాదం ఎంత తీవ్రంగా జరిగిందంటే.. కంటైనర్ లోపల రవాణా అవుతున్న ఎనిమిది సరికొత్త కార్లు మంటల దాటికి పూర్తిగా

..మిగతా 2లో

## ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టేసిన మోదీ

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
ఎన్నికల మీదున్న శ్రద్ధ ఆర్థిక వ్యవస్థపై లేదు
ఇటలీ పర్యటన..
'మెలోడీ' టాఫీలపై వ్యంగ్యాస్త్రాలు
ప్రైవేట్ పెట్టుబడులు లేనిదే
ఆర్థిక వృద్ధి అసాధ్యం
స్తంభించిన వేతనాలు..
పడిపోయిన ప్రజల కొనుగోలు శక్తి
దర్యాప్తు సంస్థల బెదిరింపులు..
వ్యాపారవేత్తల్లో భయాందోళనలు
'చందా లో ధంధా దో'..
క్రోనీ క్యాపిటలిజంపై ధ్వజం
విదేశాలకు తరలిపోతున్న
భారతీయ సంపద, పెట్టుబడిదారులు



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత పరిస్థితిపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో ద్రవ్యోల్బణం

..మిగతా 2లో

## తెలంగాణలో కార్మికులకు భారీ వేతన పెంపు



1.11 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని
సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
కనీస వేతనాల సవరణపై కేబినెట్
సబ్ కమిటీ నివేదిక ఆమోదం
అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్,
హై స్కిల్డ్ కేటగిరీలుగా విభజన
మూడు జోన్ల విధానం ద్వారా వేతన నిర్మాణం
జూన్ 1 నుంచి కొత్త వేతనాలు
అమల్లోకి వస్తాయని ప్రకటన
విదేశీ ఉద్యోగ అవకాశాల
కోసం నైపుణ్య శిక్షణకు ప్రోత్సాహం
ఏఐ ప్రభావంపై కీలక వ్యాఖ్యలు చేసిన సీఎం
పోలీసు చర్యలు, రాజకీయ విమర్శలపై సీఎం స్పందన

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో కార్మికుల కనీస వేతనాలను భారీగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ద్వారా

..మిగతా 2లో

## రేవంత్ అబద్ధం చెప్పారా లేక బండి సంజయ్ అబద్ధం చెప్పారా?

తన కొడుకుని తానే పోలీసులకు
అప్పగించానన్న బండి సంజయ్
భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్
చేశారన్న రేవంత్ రెడ్డి
ఇద్దరిలో ఎవరు చెప్పింది
నిజమన్న ప్రవీణ్ కుమార్




02

## కేబినెట్ సమావేశంలోనైనా కళ్లు తెరవండి

ప్రభుత్వం పంటలు కొనుగోలు
చేయడంలో విఫలమైందని
కేటీఆర్ ఆరోపణ
రైతుల సమస్యలపై ప్రభుత్వం
స్పందించడం లేదని విమర్శ
రెండు నెలలుగా సమస్య
కొనసాగుతున్నా చర్యలు లేవని వ్యాఖ్య
సీఎం ఇంకా "మొద్దు నిద్రలోనే
ఉన్నారు" అంటూ వ్యాఖ్య
కేబినెట్ సమావేశంలో అయినా
స్పందించాలని డిమాండ్
రైతులకు ప్రభుత్వం
క్షమాపణ చెప్పాలని సూచన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. "కేబినెట్ సమావేశంలోనైనా కళ్లు

..మిగతా 2లో

## ఉప్పల్ స్టేడియం దగ్గర బ్లాక్ టికెట్ల దందా..

ఉప్పల్ స్టేడియం వద్ద
బ్లాక్ టికెట్ల మాఫియా రెచ్చిపోతోంది
రూ.10 వేల టికెట్‌కు
రూ.2 లక్షల వరకు వసూళ్లు
గేట్ నంబర్-2 వద్ద
రహస్యంగా సాగుతున్న దందా
మఫ్టీలో పోలీసులు..
బ్లాక్ విక్రేతలపై స్పెషల్ నిఘా



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరగబోయే ఐపీఎల్ మ్యాచ్‌ను క్యాష్ చేసుకునేందుకు కేటుగాళ్లు తెగబడ్డారు. స్టేడియం పరిసరాల్లో, ముఖ్యంగా గేట్ నంబర్ 2 వద్ద బ్లాక్ టికెట్ల దందా జోరుగా సాగుతోంది. ఆన్‌లైన్ బుకింగ్స్ ప్రారంభమైనప్పుడే సిండికేట్‌గా మారి భారీగా టికెట్లు కొనుగోలు చేసిన ముఠాలు.. ఇప్పుడు మ్యాచ్ క్రేజ్‌ను వాడుకుంటూ సామాన్య అభిమానులను నిలువునా దోచుకుంటున్నాయి. అసలు ధర రూ. 1,000 గా ఉన్న సాధారణ టికెట్లను బ్లాక్‌లో రూ. 10 వేల

..మిగతా 2లో

## కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం..

తొలి పుణ్యస్నానం ఆచరించిన
కంచి పీఠాధిపతి, మంత్రులు
12 రోజుల పాటు
కొనసాగనున్న పుష్కర వేడుకలు
గోదావరి, ప్రాణహిత,
సరస్వతి నదుల పవిత్ర త్రివేణి సంగమం ఇది
భక్తుల కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

**జయశంకర్ భూపాలపల్లి, (ప్రజాక్షేత్రం):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ఈ రోజు ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి మఠం పీఠాధిపతి

..మిగతా 2లో



# బండి భగీరథ్ కేసులో కొత్త ట్విస్ట్..

మొదటిపేజీ తరువాయి



వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇటీవల భగీరథ్ అరెస్ట్‌తో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకోనున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే బండి భగీరథ్‌పై పోక్సో కేసుతో పాటు అనేక సెక్షన్స్ యాడ్ చేశారు. తాజాగా మరో కొత్త సెక్షన్ జోడించినట్లు తెలిసింది. కీలక ఆధారాలు మాయం చేసినందుకుగాను తాజాగా 238 సెక్షన్‌ను అదనంగా జోడించారు పోలీసులు. భగీరథ్ డిజిటల్ ఆధారాలను తొలగించాడని, గతంలో వాడిన ఫోన్లు, సిమ్‌కార్డులు, ఇతర ముఖ్య ఆధారాలను నిందితుడు మాయం చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుని కొత్త సెక్షన్ యాడ్ చేశారు.

ఇక తన కుమారుడి అంశంపై నిన్న(బుధవారం) మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. తనపై వస్తున్న ఆరోపణల అనంతరం తొలిసారి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్న ఆయన మీడియాతో ప్రసంగించారు. “బీజేపీలో ప్రతిఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలే ఉన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను చివరి కోరిక ఏంటని అడిగితే.. చనిపోయిన తర్వాత బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటారు. నేను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసు. నన్ను బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ పార్టీకి లోక్‌సభలో ఒక్క ఎంపీ లేరు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది.. ఆ కుటుంబ పాలనను అంతం చేసింది మేమే. అందుకే మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. కేటీఆర్ ఫేక్ సోషల్ మీడియా ఫ్యాక్టరీ నడుపుతున్నారు. కన్నకొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా? విచారణకు సహకరించాలనే నా కుమారుడిని అప్పగించా.'' అని బండి సంజయ్ అన్నారు.

# ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టేసిన మోదీ

మొదటిపేజీ తరువాయి



పెరిగిపోతోందని, పెట్టుబడులు తగ్గిపోయాయని ఆరోపించింది. సరఫరా గొలుసు నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ సెక్రటరీ జైరామ్ రమేష్ ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ కేవలం ఎన్నికలు గెలవడంపైనే దృష్టి పెట్టారని, దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన 'కొత్త జ్ఞానం' ఆయనకు ఎంతైనా అవసరమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటనను విడుదల చేశారు. మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే ఆర్థిక నిపుణులు కూడా ఇప్పుడు బహిరంగంగా దేశ ఆర్థిక స్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీన్ని బట్టే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ కేవలం ఎన్నికల వ్యూహాలు, ప్రచారాలపైనే పూర్తి సమయాన్ని కేటాయిస్తున్నారని జైరాం రమేశ్ విమర్శించారు. దేశంలో వృద్ధి అంచనాలు రోజురోజుకూ పడిపోతుంటే, ద్రవ్యోల్బణం మాత్రం సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకుంటోందని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను సరైన దారిలో పెట్టడానికి విధానపరమైన మార్పులు చేయాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తనను తాను పొగుడుకోవడానికే ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీకి ఇప్పుడు సొంత డబ్బా కొట్టుకోవడం ఆపి, ఆర్థిక ప్రగతిని పెంచేందుకు తక్షణమే కొత్త ప్రణాళికలు అవసరమని స్పష్టం చేశారు.

ఇటీవల ఇటలీ పర్యటన సందర్భంగా జరిగిన 'మెలోడీ' టాఫీ వైరల్ ఘటనను ప్రస్తావిస్తూ జైరాం రమేశ్ ప్రధాని మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. దేశంలో ఎఫ్‌డీఐలు (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) పడిపోతున్నా, మార్కెట్ సంక్షోభంలో ఉన్నా పట్టించుకోని ప్రధానమంత్రి, విదేశాల్లో టాఫీలు పంచుతూ బిజీగా గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు నీతిబోధలు చేయడం ఆపి, వాస్తవ సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సామాన్య ప్రజలు నిత్యావసరాలు కొనలేక ఇబ్బంది పడుతుంటే, ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు.

దేశంలో పెట్టుబడి వాతావరణం మందగించడంపై కాంగ్రెస్ చాలా కాలంగా హెచ్చరిస్తోందని జైరాం రమేశ్ గుర్తు చేశారు. ప్రైవేట్ కంపెనీలు దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రానంత కాలం ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. కార్పొరేట్ కంపెనీల పన్ను రేట్లను ప్రభుత్వం రికార్డు స్థాయికి తగ్గించిందని, తద్వారా వాటి ఆదాయాలు మరియు స్టాక్ మార్కెట్ వాల్యుయేషన్లు విపరీతంగా పెరిగాయని చెప్పారు. అయితే, ఈ లాభాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని, క్షేత్రస్థాయిలో కొత్త పరిశ్రమల స్థాపనకు లేదా ఉద్యోగాల సృష్టికి ఈ నిధులు ఉపయోగపడటం లేదని ఆరోపించారు.

దేశంలో అన్ని ఆదాయ వర్గాల ప్రజల వాస్తవ వేతనాలు గత కొన్నేళ్లుగా ఒకే చోట స్తంభించిపోయాయని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాలు పెరగకపోవడంతో మార్కెట్‌లో వినియోగదారుల డిమాండ్ దారుణంగా పడిపోయిందన్నారు. సామాన్యుల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల వ్యాపారాలు మందగించాయని, ప్రజలే తమ వినియోగాన్ని తగ్గించుకోవాలని స్వయంగా ప్రధానమంత్రే బహిరంగంగా కోరడం ప్రభుత్వ విఫల నినాదానికి అద్దం పడుతోందని విమర్శించారు. ప్రజల దగ్గర డబ్బు లేనప్పుడు, కంపెనీలు తమ వస్తువులను కొనేవారు లేక కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి భయపడుతున్నాయని వివరించారు.

మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తీవ్ర అభద్రతాభావంతో బతుకుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. పదే పదే పన్ను నోటీసులు పంపడం, పరిపాలనా ఉత్తర్వులతో ఇబ్బంది పెట్టడం, ఈడీ, ఐటీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్నారు. ఈ బెదిరింపుల రాజకీయాల వల్ల వ్యాపార వర్గాల్లో తీవ్ర అనిశ్చితి నెలకొందని, ఫలితంగా భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ సాహసించడం లేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

బీజేపీ ప్రభుత్వం 'చందా లో ధంధా దో' (మాకు విరాళాలు ఇవ్వండి మీకు వ్యాపారాలు ఇస్తాం) అనే అక్రమ విధానాన్ని బహిరంగంగా నడుపుతోందని జైరాం రమేశ్ తీవ్రంగా ఆరోపించారు. ప్రధానికి అత్యంత సన్నిహితులైన కొద్దిమంది పారిశ్రామికవేత్తలకు మాత్రమే ప్రభుత్వ అండదండలతో అన్ని రకాల వ్యాపారాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ బంధుప్రీతి వల్లే దేశ సంపద అంతా ఒకే చోట కేంద్రీకృతమవుతోందని, దీనికి 'మోదానీ' వ్యవహారమే అతిపెద్ద ఉదాహరణ అని ఆయన ఎద్దేవా చేశారు.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పక్షపాత వైఖరి, పన్నుల వేధింపులు భరించలేక దేశంలో ఉన్న సంపన్నులు, నిజాయితీ గల పెట్టుబడిదారులు భారీ సంఖ్యలో విదేశాలకు తరలిపోతున్నారని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. భారతదేశంలో వ్యాపారం చేయడం కంటే విదేశాల్లో పెట్టుబడులు పెట్టడమే సురక్షితమని వారు భావిస్తున్నారని జైరాం రమేశ్ అన్నారు. మేధావులు, సంపద సృష్టించే పారిశ్రామికవేత్తలు దేశం విడిచి వెళ్లడం భవిష్యత్తుకు శుభసూచకం కాదని, మోదీ ప్రభుత్వం తక్షణమే ఈ వినాశకర ఆర్థిక విధానాలను మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు

మొదటిపేజీ తరువాయి



సీఎం అన్నారు. 18 సంవత్సరాల వయస్సులోనే ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరిచారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మహిళా సాధికారతకు బలమైన పునాది వేశారని గుర్తు చేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో సోనియా గాంధీ పాత్రను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకుని సోనియా గాంధీ తీసుకున్న సాహసోపేత నిర్ణయంతోనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. తెలంగాణ సమాజం సోనియా గాంధీ కుటుంబానికి ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు.

అలాగే కాంగ్రెస్ కుటుంబం దేశ నిర్మాణానికి ఎన్నో త్యాగాలు చేసిందని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ నేతలు చేసిన కృషిని దేశ చరిత్రలో ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో కేంద్రం జాప్యం చేస్తోందని ఆరోపించారు. బిల్లును డీలిమిటేషన్ అంశంతో ముడిపెట్టి ఆలస్యం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే ఈ చారిత్రాత్మక బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని ఆయన గుర్తు చేశారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం ద్వారా సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు.

రాజీవ్ గాంధీ సాంకేతిక దార్శనికత నేటి డిజిటల్ యుగానికి బలమైన పునాది వేసిందని సీఎం పేర్కొన్నారు. ఐటీ రంగం ద్వారా లక్షలాది యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడ్డాయని, భారతదేశం ప్రపంచ స్థాయిలో పోటీ చేయగల స్థితికి చేరిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాంకేతికతను అందుబాటులోకి తేవాలన్న ఆయన ఆలోచనలు ఇప్పటికీ మార్గదర్శకంగా ఉన్నాయని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం యువత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, డిజిటల్ పురోగతి కోసం కట్టుబడి పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో విద్య, ఆరోగ్యం, ఐటీ రంగాలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం పిలుపునిచ్చారు.

# NH-44 పై భారీ ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

కాలి బూడిదయ్యాయి.

హైవేపై కంటైనర్ మంటల్లో తగలబడుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలను రోడ్డుపైనే నిలిపివేశారు. దీనివల్ల జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే స్పాట్‌కు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు.

ప్రాథమిక నివేదికల ప్రకారం, లారీలో జరిగిన షార్ట్ సర్క్యూట్ లేదా ఏదైనా ఇతర సాంకేతిక లోపం (Technical Snag) వల్లే ఈ అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల విలువైన కొత్త కార్లు నష్టపోయినప్పటికీ.. అదృష్టవశాత్తూ కంటైనర్ డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కిందకు దూకేయడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కేబినెట్ సమావేశంలోనైనా కళ్లు తెరవండి

మొదటిపేజీ తరువాయి

తెరవండి” అంటూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించిన కేటీఆర్, కొనుగోలు కేంద్రాల్లో రైతులు మరణిస్తున్న ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలు గడిచినా ప్రభుత్వం స్పందించడం లేదని, ముఖ్యమంత్రి ఇంకా మొద్దు నిద్రలోనే ఉన్నారని వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించిన ఆయన, రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడని, రాస్తారోకో జరగని రహదారి లేదని విమర్శించారు. రైతులు తమ పంటలను తామే తగలబెట్టుకునే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగుల కొరత, కొనుగోలు కేంద్రాల్లో తరుగుల వ్యవహారం, రైతులకు బోనస్ చెల్లింపుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. పంటలు కొనలేని పరిస్థితి ఉంటే రైతులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో మృతి చెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, ఈ నెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో రైతుల సమస్యలపై నిర్ణయం తీసుకోవాలని కేటీఆర్ కోరారు. ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు వెంటనే చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. “కాంటా కూడా పెట్టని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల చేతిలో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది” అంటూ హెచ్చరించిన కేటీఆర్, సీఎం రేవంత్ చరిత్రలో రైతు ద్రోహిగా మిగలొద్దని సూచించారు. చివరగా “జై కిసాన్.. జై తెలంగాణ” అంటూ తన లేఖను ముగించారు.

# ఉప్పల్ స్టేడియం దగ్గర బ్లాక్ టికెట్ల దందా..

మొదటిపేజీ తరువాయి

నుండి రూ. 20 వేల వరకు అమ్ముతుండగా, రూ. 10 వేల విలువైన VIP కార్పొరేట్ బాక్స్ టికెట్లను ఏకంగా రూ. 1 లక్ష నుండి రూ. 2 లక్షల వరకు విక్రయిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

తమ ఫేవరెట్ స్టార్ క్రికెటర్లను చూసేందుకు స్టేడియం వద్దకు భారీగా చేరుకుంటున్న అభిమానుల అవసరాన్ని ఈ కేటుగాళ్లు పెట్టుబడిగా మార్చుకున్నారు. గేట్ నంబర్ 2 వద్ద విపరీతమైన రద్దీ ఉండటాన్ని ఆసరాగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ బ్లాక్ దందాపై సైబరాబాద్ పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. స్టేడియం పరిసరాల్లో మఫ్టీలో పోలీసులను రంగంలోకి దించి నిఘా తీవ్రం చేశారు. అభిమానులను మోసం చేస్తూ బ్లాక్ టికెట్లను విక్రయించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తప్పవని, ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీస్ ఉన్నతాధికారులు హెచ్చరించారు.

# రేవంత్ అబద్ధం చెప్పారా లేక బండి సంజయ్ అబద్ధం చెప్పారా?

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

పోక్సో కేసు నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్ వ్యవహారం ఒక పెద్ద రాజకీయ రచ్చకు దారితీసింది. ఈ అరెస్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అసలు జరిగింది పోలీసు అరెస్ట్ కాదా? లాయర్ల సమక్షంలో జరిగిన సరెండరా? ఏది నిజం? అని ప్రశ్నించారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అబద్ధం చెబుతున్నారా.. లేక కేంద్ర మంత్రి బండి సంజయ్ అబద్ధం చెబుతున్నారా? అని ఆయన నిలదీశారు.

అసలేం జరిగిందంటే... ఈరోజు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... "రోడ్డు మధ్యలో నాకాబందీ నిర్వహించి మరీ బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో రాజకీయం లేదు, పోలీసుల మాట నమ్మాలి" అని స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా నిన్న బండి సంజయ్ స్పందించారు. "నేనొక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా, రాజకీయ నాయకుడిగా నా కొడుకును నేనే నా లాయర్ల ద్వారా పోలీసులకు సరెండర్ చేశాను" అని చాలా స్పష్టంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో "మనం రాష్ట్ర ముఖ్యమంత్రిని నమ్మాలా? లేక దేశ హోంశాఖ సహాయ మంత్రిని నమ్మాలా?" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# తెలంగాణలో కార్మికులకు భారీ వేతన పెంపు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆయన మీడియాకు వివరించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలను సమీక్షించకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో కార్మికులు నష్టపోయారని సీఎం విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనాల సవరణపై ప్రత్యేకంగా కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ అన్ని వర్గాల కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి కీలక సిఫార్సులు చేసిందని వెల్లడించారు.

ఈ సిఫార్సుల ఆధారంగా కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించినట్లు సీఎం తెలిపారు. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ అనే కేటగిరీలుగా వర్గీకరించామని చెప్పారు. అలాగే వేతనాల నిర్ణయానికి రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించినట్లు వివరించారు. జోన్1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్2లో మున్సిపాలిటీలు, జోన్3లో గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని తెలిపారు. జోన్1 పరిధిలో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.12,750 నుంచి రూ.16,000కు పెంచినట్లు సీఎం ప్రకటించారు. సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,592 నుంచి రూ.17,000కు పెరిగిందన్నారు. స్కిల్డ్ కార్మికులకు రూ.13,772 నుంచి రూ.18,500కు, హై స్కిల్డ్ కార్మికులకు రూ.14,607 నుంచి రూ.20,000కు వేతనాలు పెంచినట్లు వెల్లడించారు. ఈ కొత్త వేతన విధానం జూన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు.

కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఈ నిర్ణయ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధితో పాటు కార్మిక వర్గానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర యువత నైపుణ్యాభివృద్ధిపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టిందని సీఎం తెలిపారు. విదేశాల్లో ముఖ్యంగా జర్మనీ, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో నైపుణ్యం ఉన్న యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. సరైన స్కిల్స్ ఉంటే నెలకు రూ.2 లక్షల వరకు వేతనం పొందవచ్చని తెలిపారు. అందుకే యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంపై కూడా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. వైట్ కాలర్ ఉద్యోగాలకు ఏఐ వల్ల కొంత ముప్పు ఉన్నప్పటికీ బ్లూ కాలర్ ఉద్యోగాలకు పెద్దగా ప్రభావం ఉండదని అన్నారు. నైపుణ్యం ఉన్న యువతకు విదేశాల నుంచి కూడా భారీ డిమాండ్ ఉందని చెప్పారు.

ఇక బండి భగీరథ్ అరెస్టు అంశంపై సీఎం స్పందిస్తూ, పోలీసులు చెప్పినదే నమ్ముతానని అన్నారు. వాహన తనిఖీల సమయంలో అప్పా జంక్షన్ వద్ద భగీరథ్‌ను అరెస్టు చేశారని తెలిపారు. ఈ అంశంపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఫిర్యాదు అందిన వెంటనే చట్టప్రకారం పోలీసులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. పోక్సో కేసుల విషయంలో మైనర్ వివరాలను బయటపెట్టడం వల్ల బాధితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఎం గుర్తు చేశారు. ఈ అంశాలను రాజకీయంగా వాడుకోవడం సరికాదని సూచించారు. రాజకీయంగా పోరాడాలంటే వేరే అంశాలపై చేయాలని ప్రతిపక్ష నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు.


# కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం..

మొదటిపేజీ తరువాయి

శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి తొలి పుణ్యస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 5:43 గంటలకు ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పవిత్ర స్నానం చేశారు. తెలంగాణలో తొలిసారిగా జరుగుతున్న ఈ పుష్కరాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రమే కాళేశ్వరం. దేశంలో ప్రయాగ్‌రాజ్ తర్వాత ఇలాంటి త్రివేణి సంగమం ఉన్న రెండో ప్రదేశం ఇదే. ఇక్కడ స్నానం ఆచరిస్తే పాపాలు తొలగిపోయి, పునర్జన్మ నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఈ 12 రోజుల పుష్కరాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 20 నుంచి 30 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

పుష్కరాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, దేవాదాయ శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు.





## కాలనీల అభివృద్ధికి కలిసి పనిచేయాలి

**నాగారం, మే 21(ప్రజా క్షేత్రం):**


మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్‌లోని నాగారం, రాంపల్లి ఆధ్వర్యంలో విజయపురి కాలనీలో నిర్వహించిన ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం విజయవంతంగా జరిగింది. విజయపురి, హరితపురి, శివశక్తి సాయి, సింహపురి, విష్ణుపురి, భాగ్యనగర్, బాపూజీ నగర్, వెంకటేశ్వర కాలనీలకు సంబంధించిన పలు ప్రజా సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అన్ని కాలనీల ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని సమావేశంలో పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కే. జీవన్ రెడ్డి, అధ్యక్షుడు వేణుగోపాల్, సాయినాథ్ గౌడ్, దేవివర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**నాగారం, మే 21(ప్రజా క్షేత్రం):**

ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ లో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి సూచించారు. నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు, నకిలీ ఓటర్ల వివరాలను బీఎల్ఓలకు అందించి అక్రమ ఓట్ల తొలగింపుకు సహకరించాలని కోరారు. దేశ భద్రత దృష్ట్యా ప్రతి నాయకుడు బూత్ స్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు.





## వేదశ్రీ కి సైకిల్ బహుమతి అందించిన కోనేరు శశాంక్

**నిజామాబాద్ మే 21(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో పోతంగల్ కుమ్మరి లాలయ్య కుమార్తె అయినటువంటి వేదశ్రీ మండల టెన్త్ టాపర్ గా నిలిచిన సందర్భంగా కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నారై కోనేరు శశాంక్ చేతుల మీదుగా సైకిల్ ను బహుమతిగా అందజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ట్రస్ట్ బృందం ప్రకాష్ పటేల్ సున్నం సాయిలు వేముల నవీన్ ఆలపాటి హరికృష్ణ కల్లూరి బజరంగ్ గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య పబ్బ శేఖర్ గంగం కిరణ్ సెట్ గోవుర్ రమేష్ ప్రధానోపాధ్యాయులు సాయిలు ఉపాధ్యాయులు నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండలో వడ్లు కొనాలని భారీ ధర్నా

**వలిగొండ మే 21(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో వడ్ల కొనుగోళ్లలో అలసత్వాన్ని ఆగ్రహిస్తూ రైతులు చిట్యాల భువనగిరి ప్రధాన రహదారిపై భారీ రాస్తా రోకో నిర్వహించారు. రైతులకు మద్దతుగా స్థానిక బిఆర్ఎస్, సీపీఎం నేతలు మద్దతుగా నిలిచారు. నెల రోజులు గడుస్తున్నా కేంద్రాలలో వడ్ల నిలువలు పేరుకపోయాయని, ఎమ్మెల్యే పట్టించుకోవట్లేదని మండిపడ్డారు.



# డ్రైనేజీ దుర్వాసనతో గండి మైసమ్మ చౌరస్తా






- డ్రైనేజీ దుర్వాసనతో గండి మైసమ్మ చౌరస్తా
- ప్రజల ఇబ్బందులను పట్టించుకునే నాథుడే లేడా?
- డ్రైనేజీ దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

**కుత్బుల్లాపూర్, మే 21(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండి మైసమ్మ చౌరస్తాలో విజయ్ సంతోష్ ధాబా పక్కన మియాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. డ్రైనేజీ నీరు రోడ్డు పక్కనే పెద్ద గుంతలా ఏర్పడి నిల్వ ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిల్వ నీటితో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణంగా మారింది.
ప్రత్యేకంగా బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు దుర్వాసన మధ్య నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు మురుగు నీరు, మరోవైపు చెత్తకుప్పలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో హోటల్ ఉండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని చెబుతున్నారు. "హోటళ్లలో శుభ్రత పాటించాలని అధికారులు నోటీసులు ఇస్తారు... కానీ హోటల్ బయట నెలకొన్న మురుగు పరిస్థితులను మాత్రం పట్టించుకోవడం లేదు" అంటూ స్థానికులు మండిపడ్డారు. గత నెల రోజులుగా ఇదే సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వర్షాలు ప్రారంభమయ్యే ముందే డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా శుభ్రపరిచి, నిల్వ నీటిని తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఇందుర్తిలో షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం..

- మంటల్లోచిక్కుకున్న గేదెకు తీవ్ర గాయాలు...
- గడ్డి కట్టలు దగ్ధంతో రైతుకు తీరని నష్టం..

**చిగురుమామిడి, మే 21(ప్రజాక్షేత్రం):**



మండలంలోని ఇందుర్తి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో పట్టపగలు భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.నర్సింగోజు రాజమౌళి అనే రైతుకు చెందిన లక్ష 20వేల రూపాయల విలువచేసే చుడి గేదె మంటల్లో చిక్కుకోగా తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు బాధిత రైతు రోధిస్తూ తెలిపారు. అక్కడున్న పశువుల కొట్టంతోపాటు 5వందల గడ్డి కట్టలు పశుగ్రాసం దగ్ధమైనట్లు రైతు రాజమౌళి తెలిపారు. వెంటనే రైతులు ఫైర్ ఇంజన్ కు సమాచార ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లేకుంటే మరింత భారీ నష్టం జరిగేదని రైతులు వాపోయారు. గేదె 80శాతం కు పైగా మంటల్లో కాలిపోయిందని బాధిత రైతు రాజమౌళిని ప్రభుత్వం ఆదుకోవాలని తోటి రైతులు కోరుతున్నారు.



## దయారా కుంట సుందరీకరణపై జేఏసీ ఆందోళన

- రూ.3 కోట్ల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

**నాగారం, మే 21(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలో ఉన్న దయారా కుంట చెరువు సుందరీకరణ పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. చెరువు అభివృద్ధి కోసం మంజూరైన రూ.3 కోట్ల నిధుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా జేఏసీ ప్రధాన కార్యదర్శి గంద్ర కమలాకర్ పటేల్, వైస్ ప్రెసిడెంట్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ పనులు ఇప్పటివరకు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. ఇటీవల చేపట్టిన గుర్రపు డెక్కల తొలగింపు పనులు పాత నిధులతో నిర్వహించారా, లేక కొత్తగా నిధులు విడుదలయ్యాయా అనే సందేహాలు ప్రజల్లో ఉన్నాయని తెలిపారు. అధికారులు రూ.3 కోట్లతో పనులు పూర్తయ్యాయని చెబితే, ఖర్చుల పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.
దయారా కుంటను మినీ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌లు, లైటింగ్, పార్కు వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేలా చెరువును తీర్చిదిద్దాలని సూచించారు. ఒకప్పుడు 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ప్రస్తుతం 3 ఎకరాలకు కుదించుకుపోయిందని, మిగిలిన భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఆరోపించారు. వెంటనే ఆక్రమణలను తొలగించి చెరువును పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.
కార్యక్రమంలో అరవింద్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ జితేందర్ రెడ్డి, శివశక్తి సాయి కాలనీ ప్రెసిడెంట్ రోసి రెడ్డి, గోపీకృష్ణ కాలనీ ప్రెసిడెంట్ మధుకర్ రెడ్డి, సెక్రటరీ శశి, ట్రెజరర్ శంకర్‌తో పాటు కమిటీ సభ్యులు ప్రసాద్, సత్తిరాజు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



## బాబుల్గావ్ గ్రామ సమస్యలపై అధికారుల పరిశీలన

- మూడు తండాల రవాణాపై విచారణ
- మాట్లాడుతున్న తహసీల్దార్ రాజశేఖర్

**పెద్దకొడప్‌గల్, మే 21(ప్రజాక్షేత్రం):**

పెద్దకొడప్‌గల్ మండలంలోని బాబుల్గావ్ గ్రామాన్ని అధికారులు సందర్శించి మూడు తండాలకు నిత్యావసర సరుకుల రవాణాపై విచారణ చేపట్టారు. గ్రామస్తులు రవాణా, పీహెచ్‌సీ సదుపాయం లేకపోవడం, ట్రాన్స్‌కో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. కొన్ని శాఖలు ఇంకా కంగ్టి మండల పరిధిలో కొనసాగుతుండటంతో ప్రజలు పరిపాలనా సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలపై సమగ్ర నివేదిక సమర్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



## అందమైన చేతిరాతతో విద్యార్థులకు ఉజ్వల భవితం

- రేడియంట్ హైస్కూల్‌లో చేతిరాత శిక్షణ శిబిరం ప్రారంభం

**వనపర్తి, మే 21(ప్రజాక్షేత్రం):**

విద్యార్థుల అందమైన చేతిరాత వారి భావి జీవితంపై సానుకూల ప్రభావం చూపుతుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక రేడియంట్ హై స్కూల్ లో న్యూ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చేతిరాత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చక్కని చేతిరాత విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, తప్పులులేని రచనా నైపుణ్యాలను పెంపొందిస్తుందని పరిశోధకుల అభిప్రాయాన్ని గుర్తుచేశారు. మంచి చేతిరాత వల్ల విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించడమే కాకుండా గురువుల అభిమానాన్ని కూడా పొందగలరని తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలను ఇలాంటి శిక్షణ కార్యక్రమాల వైపు తల్లిదండ్రులు ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు.
కార్యక్రమంలో చేతిరాత శిక్షణ నిపుణులు తరుణ్ మాస్టర్, వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్, రామన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ దేశి రాములు, బండారు శ్రీనివాస్, నాగేశ్వర రెడ్డి, మద్దిలేటి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## ఎంబిబిఎస్ కోర్సులో టాపర్ గా వచ్చిన శ్రీ ప్రియా కు శాలువాతో సత్కారం

**కోటగిరి మే 21(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో ఎంబీబీఎస్ కోర్సు టాపర్ గా శ్రీ ప్రియ కోటగిరి గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ ఆధ్వర్యంలో పూలమాలతో పంచాయతీ కార్యాలయం సత్కారం చేయడం జరిగింది. అదేవిధంగా కోటగిరి మండల యశశ్రీ స్కూల్లో కోటగిరి మండల కు చెందిన అంతుల్ అక్కు పదవ తరగతి టాపర్గా వచ్చిన అమ్మాయికి కూడా కోటగిరి గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్లతో ఘనంగా సత్కరించడం మరియు పూలమాలతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి గ్రామ ఉపసర్పంచ్ కార్యదర్శి వార్డు సభ్యులు గ్రామపంచాయతీలో వారికి సెలవులతో పూలమాలలతో వేసి ఘనంగా సన్మానించి స్వీట్లతో ఇట్లాగే పేరు ప్రతిష్టలు తేవాలని గ్రామ సర్పంచ్ అభినందనలు తెలియజేశారు. కోటగిరి గ్రామ సర్పంచ్ మధుకర్ మరియు వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# బూర్గంపాడులో ఘనంగా రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు

**బూర్గంపాడు, మే 21(ప్రజాక్షేత్రం):**

భారతదేశ సమాచార సాంకేతిక విప్లవ పితామహుడు, భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి ఆధునిక దిశను చూపించిన మహానేత అని బూర్గంపాడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ఆశయాలను స్మరిస్తూ యువత దేశాభివృద్ధికి అంకితభావంతో పనిచేయడం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. 1991 మే 21న దేశం గొప్ప నాయకుడిని, యువత స్ఫూర్తిదాయక నాయకుడిని కోల్పోయిందని తెలిపారు. ఆయన చూపిన దారిలో నడిస్తేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేవలం 40 సంవత్సరాల పిన్న వయస్సులోనే భారతదేశ అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేశారని అన్నారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని కలగన్న నాయకుడిగా టెలికాం మరియు సమాచార సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అమరేందర్ రెడ్డి, బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్కే చోటే, కైపు శ్రీనివాసరెడ్డి, కేసుపాక మహేష్, కేసుపాక రాజేష్, గొడ్ల సంపత్, ఓబునేని రాజ్‌కుమార్, మందా యుగంధర్, తగిర్స పండు, గంటా వేణుగోపాల్, మచ్చా సిద్ధార్థ, కొమ్ము బాలు, జుంజునూరు చైతన్య తదితరులు పాల్గొన్నారు.






# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ఎమ్మెల్యే జిఎంఆర్

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 21(ప్రజాక్షేత్రం):**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 50% సబ్సిడీతో రైతులకు పచ్చిరొట్టె,జీలుగ విత్తనాల పంపిణీ చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... దేవరకద్ర నియోజకవర్గ రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 50% సబ్సిడీతో రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు, జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు, గత ప్రభుత్వం రైతుబంధు నెపంతో రైతులకు ఇచ్చే అన్ని సబ్సిడీలను ఎగ్గొట్టిందని తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ, సబ్సిడీపై విత్తనాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి,దేవరకద్ర కౌకుంట్ల మండలాల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, ఏవో రాజేందర్ అగర్వాల్, ఎంపీడీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# కల్వ రాజ వంశీ సేవలు అభినందనీయం

- **న్యూ లోటస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు**

**పెద్దేముల్, మే 21(ప్రజాక్షేత్రం):**

కల్వ రాజ వంశీ ఆధ్వర్యంలో పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామంలో గురువారం న్యూ లోటస్ హాస్పిటల్, తాండూరు వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు సాధారణ వైద్యం, చర్మ వ్యాధులు, నాడీ మానసిక సమస్యలు, దంత వైద్యం తదితర విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు.శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్యులు రోగులకు తగిన చికిత్స సూచనలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అత్కూర్ గ్రామ సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు కల్వ రాజ వంశీ సేవా కార్యక్రమాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల ఎంపీఓ రతన్ సింగ్, న్యూ లోటస్ హాస్పిటల్ తాండూరు డైరెక్టర్ మాణిక్యం, డాక్టర్లు ఫెరోజ్ అహ్మద్, న్యూరీన్ జహాన్, వెంకట్ మహేందర్,ఆత్కూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్చన, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



# కోట్ల రూపాయల ధాన్యం మాయమైనా...ఇంతటి నిర్లక్ష్యమా!

- **మిల్లులపై కేసులు సరే... కస్టోడియన్ సంగతేంటి..?**
- **డీఎస్ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?**
- **ఉన్నతాధికారుల తీరుపై డిఓపిటిలో ఫిర్యాదు చేస్తాం**

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 21(ప్రజాక్షేత్రం):**

బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అకతవకలు, రైస్ మిల్లులో ధాన్యం బస్తాల మాయంపై సివిల్ సప్లయ్ అధికారుల అవినీతి జిల్లా కలెక్టర్ కనిపించడం లేదా? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. ధాన్యం మాయం చేసిన మిల్లులపై కేసులు నమోదు చేశారే కానీ అన్నింటికీ బాధ్యుడైన డిఎస్ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో కలెక్టర్ చెప్పాలన్నారు. నవంబర్ నెలలో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి జిల్లాలోని వారాహి, చాముండి రైస్ మిల్లులు సీజ్ చేసి కేసు నమోదు చేశారన్నారు. ఈ రెండు మిల్లులకు డిఎస్ఓ కస్టోడీయన్ గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.సరిగ్గా 6 నెలల తరువాత టాస్క్ ఫోర్స్ అధికారులు మళ్ళీ అదే మిల్లులపై తనిఖీలు జరుపగా రూ. 9 కోట్లకు పైగా ధాన్యం బస్తాలు మాయం అయినట్లు గుర్తించడం జరిగిందన్నారు. గతంలో కేసు అయినప్పటికీ రెండు మిల్లులలో ఉన్న ధాన్యాన్ని కస్టోడీయన్ గా ఉన్న డిఎస్ఓ ఎందుకు షిఫ్ట్ చేయలేదని, ఆయన అండదండలతోనే ఈ తతంగం జరిగిందని ఆరోపించారు.పైగా సీజ్ చేసిన మిల్లులో డీఎస్ఓ (కస్టోడీయన్) కు తెలియకుండా ధాన్యాన్ని తరలించడం మరియు మిల్లింగ్ చేయడం అసాధ్యం అని, దీనిపై కూడా విజిలెన్స్ అధికారులు విచారణ జరపాలన్నారు. జిల్లాలోని ఉన్నతాధికారుల అండదండలు డీఎస్ఓకు సంపూర్ణంగా ఉన్నాయని, ఉన్నతాధికారుల బంధువులకు సివిల్ సప్లయ్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించే వ్యక్తి ద్వారా భారీ ఎత్తున ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు కూడా బీసీ పొలిటికల్ జేఏసీ సేకరించడం జరిగిందని, ఉన్నతాధికారుల పరువు తీయకూడదనే సదుద్దేశంతో వారి వివరాలు బయట పెట్టడం లేదని తెలిపారు. ఇంత పెద్ద అవినీతిపరుడైన డీఎస్ఓను ఎందుకు వెనకేసుకొస్తున్నారో జిల్లా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. తనకు అనుకూలంగా ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం పంపించడం, తనకు నచ్చని మిల్లులకు ధాన్యం కేటాయించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ డిఎస్ఓ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు.దాదాపు నాలుగైదు కొత్త రైస్ మిల్లులకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సాక్షాత్తు కేబినెట్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏకంగా సివిల్ సప్లయ్ కమిషనర్ గారు డీఎస్ఓను సరెండర్ చేయమంటే కూడా కలెక్టర్ ఎందుకు వెనకేసుకొస్తున్నాడో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు.సివిల్ సప్లయ్ అధికారి తీరు వల్ల పలు విమర్శలు వస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా స్పందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకుంటే ఉన్నతాధికారుల తీరుపై ఢిల్లీలోని డిఓపిటిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణప్రసాద్, యశ్వంత్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.



# జనగణనపై దుండిగల్ సర్కిల్‌లో జోనల్ కమిషనర్ సమీక్ష

- **ఖచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు**
- **ఫీల్డ్ స్థాయిలో ఎన్యూమరేషన్ ప్రక్రియ పరిశీలించిన పింకేష్ కుమార్**

**కుత్బుల్లాపూర్, మే 21(ప్రజాక్షేత్రం):**



దుండిగల్ సర్కిల్ లో కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ దుండిగల్ సర్కిల్‌ను సందర్శించి జనగణన కార్యక్రమంపై నోడల్ అధికారులు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడం, పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడం, ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయడం వంటి అంశాలపై ఆయన అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి సమాచారం సరైన విధంగా నమోదు కావాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని ఆదేశించారు.అనంతరం జోనల్ కమిషనర్ ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే పనులు సమర్థవంతంగా జరుగుతున్నాయా అనే అంశంపై ఆరా తీసి, సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకట మణి కరణ్, ఏఎంసి లక్ష్మయ్య, ఏసిపి శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ అన్వేష్ రెడ్డి, ఏఈ సురేందర్ నాయక్, సెన్సస్ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# బహదూర్‌పల్లిలో డ్రైనేజీ,రోడ్ల సమస్యలపై అధికారులకు వినతి

- **బోరు,షెడ్లు,స్నానాల గదుల కోసం కాంగ్రెస్ నేతల డిమాండ్**
- **294 డివిజన్ సమస్యలు పరిష్కరిస్తామని డిప్యూటీ కమిషనర్ హామీ**

**కుత్బుల్లాపూర్, మే 21(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లి 294 డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు డిప్యూటీ కమిషనర్ వెంకట మణి కరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పలు కాలనీల్లో డ్రైనేజీలు సరిగా లేక మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, దెబ్బతిన్న రోడ్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా స్థానిక స్మశానవాటికలో బోరు సౌకర్యం, స్నానాల గదులు, షెడ్లు వంటి కనీస వసతులు లేక అంత్యక్రియలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ వెంకట మణి కరణ్ తగిన చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఆర్ సాదు యాదవ్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.




# కూర్మాయిపల్లెలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి కోదండరామస్వామి కుంబాభిషేకం.

**బంగారుపాలెం మే 21(ప్రజాక్షేత్రం):**



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం కూర్మాయిపల్లి గ్రామంలో, గ్రామస్తుల ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి కోదండరామస్వామి కుంబాభిషేకం అత్యంత ఘనంగా గ్రామ ప్రజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామ ఊరేగింపుగా చేశారు. ఉత్సవ మూర్తులకు గ్రామస్తులు పూజ కార్యక్రమాలు నిర్వహించి, టెంకాయలు కొట్టి హారతులు ఇచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. గురువారం సాయంత్రం 6 గంటలకు కళ్యాణోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా గ్రామస్తులు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు పైగా పుష్ప పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమాన్ని గడపగడపకు వెళ్లడంతో స్వామివారికి పెద్ద ఎత్తున మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ఘనంగా కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఆలయం నిర్మాణానికి నోచుకోక ఉండడంతో, కూర్మాయిపల్లి గ్రామస్తులు చొరవ చూపి అనతి కాలంలోనే ఆలయ నిర్మాణాన్ని నిర్మించుకో గలిగారు. తమ పాలిట శ్రీరాముడు ఉన్నాడని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ గ్రామస్తులు రామ రామ అంటూ తమ గ్రామానికి మంచి జరగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుండి కూడా కొంతమంది నాయకులు వచ్చి ఆలయ దర్శనం చేసుకున్నారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలను అందించి వారి కుటుంబాలు కూడా అష్టైశ్వర్యాలతో ఉండాలని, గ్రామం కూడా రోజురోజుకీ అభివృద్ధి చెందాలని అర్చకులు దీవించారు. గ్రామంలో గురువారం ఉదయం నుండి రాత్రి వరకు శ్రీరామ శరణాలతో మారుమ్రోగింది. అర్చకులు భక్తులకు పూలు ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



# జీడిమెట్ల సర్కిల్‌లో సెన్సస్ సమీక్షా సమావేశం

- **100 శాతం హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలి:శంకర్ సింగ్**
- **సర్వే పనులపై సూపర్‌వైజర్లకు కీలక ఆదేశాలు**

**కుత్బుల్లాపూర్ మే 21(ప్రజాక్షేత్రం):**

కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్ 55 కార్యాలయంలో సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సెన్సస్ చార్జ్ ఆఫీసర్ మరియు డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెన్సస్ సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ సర్వే పనులను సమగ్రంగా సమీక్షించిన శంకర్ సింగ్, క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తమ పరిధిలోని ప్రతి ఇంటిని గడువులోగా 100 శాతం నమోదు చేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెన్సస్ ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమని పేర్కొన్న ఆయన, వేగంగా విస్తరిస్తున్న సైబరాబాద్ ప్రాంతంలో విద్య, వైద్యం, గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు మరియు ప్రభుత్వ నిధుల కేటాయింపులో ఈ గణాంకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వివరించారు. అదేవిధంగా, సర్వేలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు డేటా విశ్వసనీయతను కాపాడాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచార గోప్యతకు ఎలాంటి భంగం కలగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూపర్‌వైజర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సెన్సస్ సూపర్‌వైజర్లు, నోడల్ అధికారులు పాల్గొని సర్వే నిర్వహణపై పలు అంశాలను చర్చించారు.





## శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**కాణిపాకం మే 21(ప్రజాక్షేత్రం):**

చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆలయ మర్యాదలతో స్థానిక శాసన సభ్యులతో కలిసి స్వామివారి ప్రత్యేక దర్శనం చేసుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిదర్శనానంతరం ఆలయ అర్చకుల నుంచి వేదాశీర్వచనం స్వీకరించిన మంత్రి ఆనం భక్తుల సేవార్థం నూతనంగా నిర్మించిన "వినాయకసదన్ అకామిడేషన్ బిల్డింగ్"ను స్థానిక శాసన సభ్యులతో కలిసి ప్రారంభించిన మంత్రి ఆనం రూ.14.74 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన వసతి గదులను భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చిన దేవాదాయ శాఖ కొత్తగా నిర్మించిన బ్లాకుల్లో 108 గదులు, ఆధునిక సౌకర్యాలతో భక్తులకు మెరుగైన వసతి ఏర్పాటు రూ.2.10 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఫర్నిచర్, టేక్ వుడ్ పడకలు, సోఫాలు, డైనింగ్ టేబుల్స్ తదితర సదుపాయాలు ఏర్పాటు ప్రతి గదిలో స్వామివారి ఫోటో ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక వాతావరణం కల్పించిన దేవస్థానం భక్తులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు శాసనసభ్యులు జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయం పాలక మండలి చైర్మన్ మనీ నాయుడు, ఇతర సభ్యులు, ఈవో పెంచల్ కిషోర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 52 ఆలయాలలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించుచున్నాము. భవిష్యత్తులో ఈ పథకాన్ని 116 ఆలయాలలో విస్తరింప చేయడానికి చర్యలు చేపడుతున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో త్వరలో గోదావరి పుష్కరాలు, కృష్ణ పుష్కరాలు నిర్వహించుచున్నాము మంత్రి ఆనం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పురాతనమైన దేవాలయాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. అర్ధగిరి, మొగిలి ఆలయము టూరిస్ట్ హబ్ గా అభివృద్ధిగా చేయడానికి చర్యలు చేపడుతున్నాము. కాణిపాక ఆలయమున విస్తృతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు అమలు చేయుచున్నాను. అరగొండ చౌడేశ్వరాలయం ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి అపోలో దాతల సహకారంతో, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో త్వరలో పనులు చేపట్టడం జరుగుతుంది వివిధ ఆలయాలలో 106 ఈవో పోస్టులు ఏపీపీఎస్ ద్వారా పరీక్షలు నిర్వహించి భర్తీ చేయడానికి చర్యలు చేపడుతున్నాము వివిధ ఆలయాలలో పని చేసే ఉద్యోగస్తులకు వేతనాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

## వి బి జి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

- కొండమడుగు నరసింహ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

**వలిగొండ మే 21(ప్రజాక్షేత్రం):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విబిజీ రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, బడ్జెట్లో కేటాయించిన నిధులను సక్రమంగా విడుదల చేయాలి. సంవత్సరానికి ప్రస్తుతం ఉన్న పని దినాలను పెంచి 200 రోజుల పని కల్పించాలి. అలాగే రోజు కూలీని రూ.600లకు పెంచి వ్యవసాయ కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలి పని ప్రదేశాల్లో ఉదయం ఒకసారి, నాలుగు గంటల తర్వాత మరోసారి ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలి. ఈ విధానం కూలీలకు ఇబ్బందులు కలిగించేలా ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కూలీలకు అవసరమైన పనిముట్లు అయిన గడ్డపార, పార, తట్ట, గొడ్డలి వంటి సామగ్రిని ప్రభుత్వం అందించాలి. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం వెంటనే అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విబిజీ రాంజీ చట్టాన్ని ఉపసంహరించుక విధంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శిలు వేమన బోయిన జంగయ్య, మద్దెల శంకరయ్య, మండల నాయకులు జక్కల అంజయ్య, చేకూరి నరసింహ, యాదమ్మ, సుగుణమ్మ, మణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## షాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 21(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని బొడంపాడు గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో సబ్బరి గారి చిన్నయ్య అనే వ్యక్తి అక్కడక్కడే మృతిచెందగా మరో వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారమందుకున్న షాబాద్ పోలీసులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గండి మైసమ్మ,ఐడిపిఎల్ లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

- మొహమ్మద్ లంర్రా హైమద్ టీఆర్ఎస్‌లో చేరిక
- గండి మైసమ్మలో కవిత రాజకీయ శంఖారావం
- అమరుల స్థూపం ఆవిష్కరణపై ప్రభుత్వానికి హెచ్చరిక
- జూన్ 2లోగా స్థూపం ఆవిష్కరించాలి:కవిత

**యువతకు రూ.20 కోట్ల వరకు రుణాలు**

యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక విధానాలు తీసుకువస్తామని కవిత తెలిపారు. వ్యాపారం చేయాలనుకునే యువతకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కూడా చేపడతామని హామీ ఇచ్చారు.







**కుత్బుల్లాపూర్, మే 21(ప్రజాక్షేత్రం):**

గండి మైసమ్మ చౌరస్తా, ఐడిపిఎల్‌లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జెండాను ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. అనంతరం ఐడిపిఎల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ తరపున గతంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మొహమ్మద్ లంర్రా హైమద్ , కవిత సమక్షంలో అధికారికంగా టీఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు భారీగా హాజరైన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కూడా తెలంగాణ రక్షణ సేనలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన మొహమ్మద్ లంర్రా హైమద్ చేరికతో పార్టీకి కుత్బుల్లాపూర్ ప్రాంతంలో మరింత బలం చేకూరుతుందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.విద్యార్థులకు సహాయం, పేద కుటుంబాలకు అండగా నిలవడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మొహమ్మద్ లంర్రా హైమద్ ప్రజల్లో విశ్వాసం సంపాదించుకున్నారని స్థానికులు పేర్కొన్నారు.

**అమరుల స్థూపం ఆవిష్కరించాలి**

తెలంగాణ అమరుల స్థూపం నిర్మించి 20 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు అధికారికంగా ఆవిష్కరణ జరగకపోవడం బాధాకరమని కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ ఉద్యమ పార్టీ అని చెప్పుకునే నాయకులు అమరుల త్యాగాలను విస్మరించారని ఆరోపించారు. జూన్ 2లోగా ప్రభుత్వం అధికారికంగా స్థూపాన్ని ఆవిష్కరించాలని, లేనిపక్షంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో తామే ఆవిష్కరిస్తామని హెచ్చరించారు.

**ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి**

జూన్‌లో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ స్కూళ్లు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నాయని కవిత ఆరోపించారు. వచ్చే నెలలోగా ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం ఖర్చులతో ప్రజల ఇళ్లు గుల్ల అవుతున్నాయని పేర్కొంటూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రైవేట్ విద్యార్థులకు కూడా ఉచిత విద్య, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

**ఉద్యమకారుల హామీలపై ఫైర్**

తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని కవిత మండిపడ్డారు. కేకే కమిటీ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. జూన్ 2లోగా పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ ఉద్యమం తరహాలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

**రైతుల సమస్యలపై ఘాటు విమర్శలు**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని కవిత విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, గన్నీ బ్యాగులు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సన్న వడ్లకు ఇవ్వాల్సిన బోనస్‌ను ప్రభుత్వం ఎగ్గొట్టేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతుల పక్షాన తెలంగాణ రక్షణ సేన ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

**సామాజిక న్యాయ తెలంగాణే లక్ష్యం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, మైనార్టీలు అందరికీ న్యాయం జరిగేలా సామాజిక న్యాయ తెలంగాణ నిర్మాణమే తమ లక్ష్యమని కవిత పేర్కొన్నారు. టీఆర్ఎస్ జెండాలోని పసుపు, నీలం, పచ్చ రంగుల ప్రతీకలను వివరిస్తూ... "పసుపు రంగు సౌభాగ్యానికి, నీలం కూలీలు మరియు అణగారిన వర్గాలకు, పచ్చ మైనార్టీలు మరియు పర్యావరణానికి ప్రతీక" అని తెలిపారు.

**మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యం**

మైనార్టీలలోని ప్రతి మతానికి ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేశామని కవిత వెల్లడించారు. సిక్కులు, ముస్లింలు, క్రిస్టియన్లు సహా అన్ని వర్గాల అభ్యున్నతికి తెలంగాణ రక్షణ సేన కృషి చేస్తుందని చెప్పారు. "నేను మీ బిడ్డను... మీపై ఒక్క పైసా భారం పడకుండా పాలన చేస్తాను" అంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ సమావేశంలో దుగుంట్ల నరేష్ ప్రజాపతి రమిది, వెంకట్ రెడ్డి ,మారయ్య, మనోజ, వీరేందర్, రాజలింగం, శోభన్, సీతారామ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక భారత నిర్మాణ శిల్పి రాజీవ్ గాంధీకి ఘన నివాళి

**వనపర్తి, మే 21(ప్రజాక్షేత్రం):**

మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాణ శిల్పిగా, యువతకు స్ఫూర్తి ప్రదాతగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కంప్యూటర్ విప్లవానికి నాంది పలికి, సమాచార సాంకేతికత అభివృద్ధికి బాటలు వేసిన దూరదృష్టి గల నాయకుడిగా రాజీవ్ గాంధీ చిరస్మరణీయులని తెలిపారు. గ్రామీణాభివృద్ధికి విశేష కృషి గ్రామీణాభివృద్ధి, విద్య, యువత సాధికారత, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు దేశ చరిత్రలో నిలిచిపోతాయని నాయకులు పేర్కొన్నారు. ఆధునిక ఆలోచనలతో యువ భారతానికి కొత్త దిశను చూపించిన నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. రాజీవ్ గాంధీ ఆశయాలు, సేవా తత్వం నేటి తరానికి ఆదర్శప్రాయమని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తర్వాత జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఐటీ రంగ ప్రధాత రాజీవ్‌గాంధీ వర్ధంతి

- రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన భీమ్ భరత్
- సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసిన మహోన్నత నాయకుడు
- ఘనంగా నిర్వహించిన మొయినాబాద్ మండల కాంగ్రెస్ శ్రేణులు

**మొయినాబాద్, మే 21(ప్రజాక్షేత్రం):**

భారతదేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసి, దేశంలో ఐటీ రంగ అభివృద్ధికి బలమైన బాటలు వేసిన మహోన్నత విజేత, మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ అని చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పామెన భీమ్ భరత్ కొనియాడారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి భీమ్ భరత్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు, యువతకు ఉపాధి కల్పించేలా ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేయించేందుకు రాజీవ్‌గాంధీ అహర్నిశలు కృషి చేశారన్నారు. నిరుపేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన ఆయన.. ఉగ్రమూకల దారుణ దాడికి బలికావడం దేశానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలు, దూరదృష్టి భవిష్యత్ తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ నివాళి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీశ్, మొయినాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాణయ్య, సర్పంచ్ రాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ముఖ్య నాయకులు బద్రప్ప, కంజర్ల భాస్కర్, గణేశ్ గౌడ్, మినజుద్దీన్, సుధాకర్ గౌడ్, మల్లేశ్, దయానంద గౌడ్, చిలుకూరు ఆంద్రూ, హిమాయత్‌నగర్ రవి, సురేశ్ అమ్డాపూర్, మల్లేశ్ ఎన్కేపల్లి, బిక్షపతి, విక్రమ్ రెడ్డి, గన్నెపగ నర్సింగరావు, చంద్రశేఖర్, శంకర్ గౌడ్, రాజేందర్ యాదవ్, శ్రీనివాస్, రాంరెడ్డి, చిలుకూరు రాజు, మైసయ్య, నవాబ్‌పేట్ శేఖర్, జయరాం రెడ్డి, చిలుకూరు కుమార్, ధనరాజ్, చించల్‌పేట్ పాండురంగారెడ్డి, మద్దూరు సర్పంచ్ రాజు నాయక్, కొమరబండ సుభాష్ చంద్రబోస్, నాగిరెడ్డిగూడ సర్పంచ్ సంజీవరెడ్డి, అంతప్పగూడ పెంటయ్యలతో పాటు చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల, మున్సిపల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





# షాబాద్ రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ విలేకరుల హల్ చల్.

- **రెవెన్యూ అధికారుల అండదండలతో సీనియర్ విలేకరుల వసూల్ దందా..**
- **షాబాద్ రెవెన్యూ కార్యాలయంలో బ్రోకర్ వ్యవస్థ భూస్థాపితం చేయాలని ప్రజాసంఘాల డిమాండ్.**
- **షాబాద్ పోలీస్ స్టేషన్ లో కూడా సీనియర్ విలేకరుల అండదండలతో పని చకాచక**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 21(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో కొందరికి అక్రమ వసూళ్లకు వేదికగా మారింది, షాబాద్ మండలం మారుమూల గ్రామాల నుండి వారి సమస్యలను పరిష్కరించాల్సిన చోటా విలేకరులా ముసుగులో బాధితులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి, షాబాద్ మండల తాసిల్దార్ కార్యాలయంలో ఈ దందా ఇప్పుడ మండలంలో సంచలనంగా మారింది. కార్యాలయంలో అడ్డగా బేరసారాలు రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు తాసిల్దార్ కార్యాలయానికి తమ భూములకు న్యాయం కోసం వచ్చే సామాన్య ప్రజలను సీనియర్ విలేకరులు టార్గెట్ చేస్తున్నట్లు బాధితులు రాగానే అధికారుల కంటి ముందే మీరు రంగ ప్రవేశం చేసి సమస్యను పరిష్కరిస్తామంటూ వేలకు వేల రూపాయలు వసూలు చేయడం అందులో కొంత భాగం అధికారులకు, చేరవేస్తూ మిగిలింది తమ జేబుల్లో వేసుకుంటారని కొంతమంది అండదండలు చూసుకొని ప్రజాస్వామ్యాన్ని మేము చెప్పిందే చట్టం, అడ్డొస్తే అక్రమ కేసులు, ఇరికిస్తామంటూ సామాన్య ప్రజలను బెదిరించడం సీనియర్ బరితెగింపులకు నిదర్శనం, అధికారుల అండదండలతో చేస్తున్న ఈ అరాచకాలు సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి..,?**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో రాజ్యమేలుతున్న బ్రోకర్ వ్యవస్థ పై జిల్లా కలెక్టర్, మరియు సబ్ కలెక్టర్, అధికారులు తక్షణమే దృష్టి సాధించాల్సిన అవసరం ఉంది, రెవెన్యూ అధికారుల పేరు వాడుకుంటూ సామాన్యులను పీడిస్తున్న సీనియర్ విలేకరుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో తెలియాల్సి ఉంది. జర్నలిజం ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే వ్యవస్థ పై ప్రజలకు ఉన్న నమ్మకం సన్నగిల్లి పోయే ప్రమాదం పోయే ప్రమాదం ఉందని జర్నలిస్ట్ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



# రాత్రి వేళల్లో ఏదేచ్ఛగా అక్రమంగా మట్టి తరలింపు

- **ట్రాక్టర్ల మరియు టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న మాఫియా**
- **పట్టించుకోని అధికారులు**

**జోగులాంబ గద్వాల జిల్లా మే 21(ప్రజాక్షేత్రం):**

గద్వాల మండలం, వెంకటోనిపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా యదేచ్ఛగా మట్టిని తరలిస్తూ కాసులు కురిపిస్తున్నారు. పగటి వేళల్లో మరియు రాత్రి వేళల్లో ప్రభుత్వ ప్రభుత్వ భూమిని కొల్లగొడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్న అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనేది జోరుగా ప్రచారం సాగుతుంది. వెంకటోనిపల్లి గ్రామం నుంచి జమ్మిచెడు మేళ చెరువు రోడ్డు నుంచి పిల్లిగుండ్ల మీదుగా మేళచెరువు రోడ్ సర్కిల్ లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. మట్టి మాఫియా ప్రభుత్వ భూమిని కొల్లగొడుతు కాసులు కురిపిస్తున్న అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

# కేటుగాడు సంతోష్ కుమార్ గుప్తా

- **సీఎం మనిషినంటూ బెదిరింపులు..**
- **పోలీసుల అదుపులో కేటుగాడు**

**హైదరాబాద్ మే 21(ప్రజాక్షేత్రం):**



సీఎం మనిషిని.. కాంగ్రెస్ పార్టీ నాయకుడిని అని చెప్పుకుంటూ ఖరీదైన కార్లలో తిరుగుతూ మోసాలకు పాల్పడుతున్న కేటుగాడు సంతోష్ కుమార్ గుప్తా ఆటను మేడ్చల్ పోలీసులు కట్టించారు. ముఖ్యమంత్రి, మంత్రుల పేర్లు చెప్పి వివిధ రంగాలకు చెందిన వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ.. భారీగా నగదు వసూళ్లకు పాల్పడుతున్నాడు. దీనితో పోలీసులకు సంతోష్ కుమార్ గుప్తాపై ఫిర్యాదు అందింది. దాంతో అతడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్, కొంపల్లి, సుచిత్ర, మేడ్చల్ పరిసర ప్రాంతాల్లోని భూ వివాదాలు, విద్యా సంస్థల నుంచి అతడు భారీగా నగదు వసూళ్లు చేశాడు. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లొసుగులను లక్ష్యంగా చేసుకుని ఆర్టీఐ చట్టం పేరుతో రియల్టర్లను బ్లాక్ మెయిల్ చేసేవాడు. విలాసవంతమైన హోటళ్లను వేదికగా చేసుకుని అతడు పలు రకాల సెటిల్‌మెంట్లు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడి అయింది. అయితే మునీరాబాద్‌లోని 'ఆరో రియాల్టీ' సంస్థ యాజమాన్యాన్ని సంతోష్‌కుమార్ గుప్తా బెదిరించాడు. ఈ సంస్థ నిర్వాహకులను భయపెట్టి రూ.6 కోట్ల విలువైన 5 విల్లాలు లేదా రూ.25 కోట్లు ఇవ్వాలంటూ సంతోష్ కుమార్ డిమాండ్ చేశాడు. దీనితో మేడ్చల్ పోలీసులను వారు ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దాంతో వారికి సంతోష్ కుమార్ చిక్కాడు..





# పోక్సో బాధితులకు అండగా భరోసా

- **ఒకేచోట వైద్యం.. కౌన్సెలింగ్.. న్యాయ సహాయం**
- **ప్రభుత్వ భవనంలోకి భరోసా కేంద్రం మార్పు**
- **వనపర్తిలో భరోసా కేంద్రం, పోలీస్ జిమ్ ప్రారంభం**

**వనపర్తి, మే 21 (ప్రజాక్షేత్రం):**

పోక్సో, లైంగిక వేధింపుల బాధితులకు తక్షణ సహాయం, మానసిక భరోసా, న్యాయ సహాయం, వైద్య సేవలు ఒకేచోట అందించడమే భరోసా కేంద్రాల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న భరోసా కేంద్రాన్ని ప్రభుత్వ భవనానికి మార్పు చేసి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిమ్‌ను కూడా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రారంభించారు.

తెలంగాణ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీజీపీ చారు సిన్హా ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ సునీతారెడ్డి ప్రత్యేక చొరవతో డీఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న పాత పోలీస్ నివాస భవనాన్ని మరమ్మతులు చేసి భరోసా కేంద్రంగా అభివృద్ధి చేశారు. ఉమెన్ సేఫ్టీ వింగ్, కలెక్టర్ నిధులతో ఈ పనులు చేపట్టారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వసంతి ఫౌండేషన్ సహకారంతో పోలీస్ కార్యాలయంలో ఆధునిక జిమ్ ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జోగులాంబ జోన్7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతారెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్ మీనా తదితరులు హాజరయ్యారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం: చిన్నారెడ్డి**

ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, శారీరక దారుఢ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని చిన్నారెడ్డి సూచించారు. "హెల్త్ ఈజ్ వెల్త్" అనే భావనతో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. పాత ప్రభుత్వ భవనాలను పునరుద్ధరించి వినియోగించడం మంచి పరిపాలనకు నిదర్శనమన్నారు.

**యువత క్రీడలపై దృష్టి పెట్టాలి -ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా వారోత్సవాలు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్నాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. వ్యాయామం, క్రీడలు ఆరోగ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. నల్లచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద రెండు జిమ్



కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**దేశానికే ఆదర్శంగా భరోసా కేంద్రాలు**

తెలంగాణ ప్రభుత్వం 2018లో ప్రారంభించిన భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ అన్నారు. బాధితుల గోప్యత కాపాడుతూ, వారికి వైద్య, న్యాయ, మానసిక సహాయం అందించడం ఈ కేంద్రాల ముఖ్య ఉద్దేశమన్నారు.

**మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యం**

పోక్సో, అత్యాచార బాధితులకు మానసిక క్షోభ తగ్గించేలా భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ సునీతారెడ్డి తెలిపారు. తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో మహిళా రక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

**పోలీస్ జట్టు విజేత**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఉపాధ్యాయుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులకు కొత్త క్యాప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, సీఐలు సుగంధ రత్నం, రాంబాబు, ఆర్ఐలు శ్రీనివాస్, అప్పలనాయుడు, భరోసా ఎస్సై అంజద్, కోఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ వేధింపుల ఆరోపణలతో యువకుడికి అరగుండు.. చెప్పుల దండతో ఊరేగింపు

**అనంతపూర్ మే 21(ప్రజాక్షేత్రం):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపూర్ జిల్లాలో ఓ యువకుడిని గ్రామస్తులు అవమానకరంగా ఊరేగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో ఓ వివాహితను వేధిస్తున్నాడనే ఆరోపణలతో గ్రామస్తులు యువకుడికి అరగుండు కొట్టించి, మెడలో చెప్పుల దండ వేసి గ్రామ వీధుల్లో డప్పులు మోగిస్తూ ఊరేగించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సంఘటన అనంతపురం జిల్లా గడేకల్ల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు భాస్కర్ అనే యువకుడు ఓ వివాహితను గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మహిళ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. గ్రామస్తుల కథనం ప్రకారం, భాస్కర్ మరియు ఆ మహిళ గతంలో ప్రేమించుకున్నారని సమాచారం. అయితే కుటుంబ పరిస్థితుల కారణంగా ఆమెకు మరొకరితో వివాహం జరిగింది. పెళ్లి అనంతరం కూడా భాస్కర్ ఆమె వెంటపడటం కొనసాగించాడని స్థానికులు చెబుతున్నారు. దీంతో కుటుంబంలో తరచూ గొడవలు చోటుచేసుకున్నాయని, చివరకు మహిళ భర్త ఆమెను పుట్టింటి వద్ద వదిలి వెళ్లిపోయాడని సమాచారం. తమ కుమార్తె దాంపత్య జీవితం చెడిపోవడానికి భాస్కర్ వేధింపులే కారణమని భావించిన మహిళ కుటుంబ సభ్యులు అతడిని పట్టుకుని గ్రామ మధ్యలోకి తీసుకొచ్చారు. అక్కడ అతనికి దేహశుద్ధి చేసి, అరగుండు కొట్టించారు. అనంతరం మెడలో చెప్పుల దండ వేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ ఘటనను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో విషయం బయటపడింది.

వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు మహిళను వేధించిన వ్యక్తికి తగిన శిక్ష పడిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైంది కాదని అంటున్నారు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే కానీ, ఇలాంటి అవమానకర శిక్షలు సమంజసం కాదని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు ఈ ఘటనపై యువకుడి కుటుంబ సభ్యులు అధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని సమాచారం. అయితే వీడియో వైరల్ కావడంతో పోలీసులు స్వయంగా విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్న పోలీసులు గ్రామస్తుల చర్యలపై చట్టపరమైన కోణంలో పరిశీలిస్తున్నట్లు సమాచారం.



## ధరలు పెంచుతున్న మారుతి...
# అన్ని మోడళ్లకు వర్తిస్తుంది!

- **మారుతీ సుజుకీ కార్ల ధరల పెంపు**
- **జూన్ నుంచి కొత్త ధరలు అమల్లోకి**
- **మోడల్‌ను బట్టి రూ. 30,000 వరకు పెంపు**
- **తయారీ వ్యయాలు పెరగడమే కారణమని వెల్లడి**
- **ఇప్పటికే పలు ఆటో కంపెనీలు ధరల పెంపు**

**నేషనల్ బ్యూరో మే 21(ప్రజాక్షేత్రం):**



దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ కొత్త ధరలు జూన్ నుంచి అమల్లోకి రానున్నాయి. మోడల్‌ను బట్టి గరిష్ఠంగా రూ. 30,000 వరకు ధరలు పెరగనున్నాయని కంపెనీ తన స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో స్పష్టం చేసింది. ముడి సరుకుల ధరలు, నిర్వహణ వ్యయాలు నిరంతరం పెరుగుతుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని మారుతీ సుజుకీ తెలిపింది. గత కొద్ది నెలలుగా ఖర్చులను తగ్గించుకునేందుకు అనేక చర్యలు తీసుకున్నామని, వ్యయ భారాన్ని వీలైనంత వరకు తామే భరించామని వివరించింది. అయితే, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితుల కారణంగా పెరిగిన ఖర్చుల్లో కొంత భాగాన్ని వినియోగదారులపై బదిలీ చేయక తప్పడం లేదని పేర్కొంది. తమ పోర్ట్‌ఫోలియోలోని అన్ని మోడళ్లపై ఈ పెంపు వర్తిస్తుందని, అయితే మోడల్‌ను బట్టి పెంపులో వ్యత్యాసం ఉంటుందని కంపెనీ తెలిపింది. వినియోగదారులపై వీలైనంత తక్కువ ప్రభావం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఇటీవలి కాలంలో ముడి సరుకులు, రవాణా ఖర్చులు పెరగడంతో పలు ఆటోమొబైల్ కంపెనీలు ఇప్పటికే తమ వాహనాల ధరలను పెంచాయి. ఏప్రిల్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా కూడా తమ ఎస్ యూవీలు, వాణిజ్య వాహనాల ధరలను 2.5 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే.

# 'కుర్చీ మడతపెట్టి' ఫేమ్ కుర్చీతాత కన్నుమూత

- **'కుర్చీ మడతపెట్టి' డైలాగ్‌తో ఫేమస్ అయిన షేక్ మహ్మద్ పాషా మృతి**
- **హైదరాబాదులో ఎండ తీవ్రతకు తట్టుకోలేక కుప్పకూలిన వైనం**
- **'గుంటూరు కారం' సినిమాలో పాటతో మరింత పాప్యులర్**
- **మద్యానికి బానిసై కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పాషా**

**హైదరాబాద్ మే 21(ప్రజాక్షేత్ర):**



'కుర్చీ మడతపట్టి' అనే ఒక్క డైలాగ్‌తో సోషల్ మీడియాలో సంచలనంగా మారిన షేక్ మహ్మద్ పాషా (64) బుధవారం కన్నుమూశారు. ఆయనను అందరూ 'కుర్చీతాత' లేదా 'కాలా పాషా'గా పిలుస్తుంటారు. మంగవారం మధ్యాహ్నం యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్క్ వద్ద ఎండ తీవ్రతకు తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయారు. అపస్మారకస్థితిలో పడిఉన్న ఆయనను యూట్యూబర్ వైజాగ్ సత్య ఇంటికి చేర్చారు. నిన్న సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురై తన ఒడిలోనే ప్రాణాలు వదిలాడని భార్య ఆసియా సుల్తానా కన్నీటి పర్యంతమయ్యారు. వరంగల్‌కు చెందిన పాషా, సుమారు 40 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి రహ్మత్‌నగర్‌లో స్థిరపడ్డారు. ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో కుటుంబ సంభాషణ గురించి చెబుతూ ఆయన వాడిన 'కుర్చీ మడతపెట్టి' అనే పదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ పాప్యులారిటీతో మహేశ్ బాబు నటించిన 'గుంటూరు కారం' చిత్రంలోని టైటిల్ సాంగ్‌లో ఇదే పదాన్ని పాడే అవకాశం దక్కించుకున్నారు. ఆ పాటతో ఆయన మరింత ఫేమస్ అయ్యారు. అయితే, కొంతకాలంగా మద్యానికి బానిసైన పాషా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కుర్చీతాతకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, నెటిజన్లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎస్పీ నరసింహ

- **అక్రమ రవాణా, అసాంఘిక చర్యలపై పటిష్ట నిఘా**

**సూర్యాపేట మే 21(ప్రజాక్షేత్రం):**



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నరసింహ ఐపీఎస్ నెలవారీ పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు. డయల్-100 స్పందన, పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నియంత్రణ, మహిళా భద్రత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## అప్పు అడిగినందుకు 500 మీటర్లు కారు బోనెట్‌పై ఈడ్చుకెళ్లాడు!

**కర్ణాటక మే 21(ప్రజాక్షేత్రం):**

డబ్బుల గొడవ కాస్తా ఒక వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వ్యక్తిని కారు బోనెట్‌పై సుమారు అర కిలోమీటరు దూరం ఈడ్చుకెళ్లిన దిగ్భ్రాంతికర సంఘటన కర్ణాటకలోని మైసూరులో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన విజువల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఘోరానికి సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులు వెల్లడించారు.

**పోలీసుల కథనం ప్రకారం..**

మైసూరుకు చెందిన మహాదేవ్ అనే వ్యక్తి, ధనుంజయ్ అనే మరో వ్యక్తికి కొంతకాలం క్రితం డబ్బును అప్పుగా ఇచ్చాడు. అయితే ఎంతకాలమైనా ఆ డబ్బును తిరిగి ఇవ్వకపోవడంతో, మహాదేవ్ తన బకాయిలను తక్షణమే చెల్లించాలని ధనుంజయ్‌ను గట్టిగా నిలదీశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మాట మాట పెరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మహాదేవ్ ఒత్తిడి తట్టుకోలేక ధనుంజయ్ అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ వెంటనే తన కారు ఎక్కి స్టార్ట్ చేశాడు.



## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో పారదర్శకత, వేగం ఉండాలి

- **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్**

**నిజామాబాద్ జిల్లా, మే 21(ప్రజాక్షేత్రం) :**

రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ నిర్వహించిన సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయిలో సేవలను మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులతో జూమ్ ద్వారా నిర్వహించిన ఈ భేటీలో, మాతా శిశు మరణాలను అరికట్టేలా ప్రతి ప్రసవం ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని కమిషనర్ స్పష్టం చేశారు. గర్భిణీలకు కనీసం నాలుగుసార్లు వైద్య పరీక్షలు నిర్వహించడం, ప్రమాదకర స్థితిలో ఉన్నవారిని ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే పరీక్షలు, మంగళవారం చేపడుతున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళల జీవనశైలి వ్యాధులు, గర్భాశయ సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించాలని పేర్కొన్నారు. లింగ వివక్షను అరికట్టేందుకు పిండలింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని హెచ్చరించారు. వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం లక్ష్యంతో అందించాలని, 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఎమ్మార్ వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, వైకల్యం గల పిల్లలను ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు రీఫర్ చేయాలని సూచించారు. క్షయ రహిత గ్రామాల ఏర్పాటు లక్ష్యంగా ప్రతిరోజూ మొబైల్ ఎక్స్‌రేల ద్వారా పరీక్షలు నిర్వహించాలని, అలాగే టెలీ మానస్ కాల్స్ ద్వారా మానసిక ఆరోగ్య సేవలను విస్తృతం చేయాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్‌లో సేవల నమోదును వేగవంతం చేయాలని, వైద్య సేవలన్నీ జిల్లా స్థాయిలో డిజిటలైజ్ చేసేలా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా స్థాయి వైద్య ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్ఓలు, వైద్య బృందాలు పాల్గొన్నారు.

## కంపెనీ డబ్బులు కొట్టాడు .. షేర్ మార్కెట్లో పెట్టాడు..

- **బోలెడు డిగ్రీలు సాధించి మోసాల వైపు హనుమాన్ల లక్ష్మణ్..**
- **పరిశ్రమ పరిశీలనలో తేలిన నిజం..**
- **రూ.7 కోట్ల 90 లక్షల 27,915 మోసం..**
- **నిందితుడి వివరాలు వెల్లడించిన డిసిపి శిరీష**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 21(ప్రజాక్షేత్రం)**

కంపెనీ నుంచి బయటకు పంపాల్సిన డబ్బులను తెలివిగా తన ఖాతాలో జమ చేసుకున్నాడు.. కోట్ల రూపాయలు సంపాదించి షేర్ మార్కెట్‌కు తరలించాడు.. అక్కడ కూడా నష్టపోయాడు.. చివరికి పోలీసుల చేతికి చిక్కి కటకటాల వెనక్కి వెళ్ళాడు.. పలు డిగ్రీలు చేసి చదువుకున్న ఓ తెలివైన మూర్ఖుడు చేసిన ఈ పని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండల పరిధిలోని ఆర్.ఎం. కన్వర్టర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో వెలుగు చూసింది. షాద్ నగర్ డిసిపి శిరీష గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించారు. ఆమె అందించిన వివరాల ప్రకారం గత ఆరు నెలల కాలంగా పరిశ్రమలోని అకౌంట్ సెక్షన్ లో పనిచేసే హనుమాన్ వెండర్లకు పంపించాల్సిన డబ్బులు వారికి పంపకుండా వారి పేరుతోనే పంపుతున్నట్లుగా రికార్డులు నమోదు చేసి తన అకౌంట్ కి తరలించుకుంటున్నాడు. అలా ఇప్పటికీ రూ.7.90 కోట్ల పై చిలుకు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇటీవల తమకు అందిన ఫిర్యాదు మేరకు డైరెక్టర్ రికార్డులను పరిశీలించగా ఏదో మోసం జరిగినట్లుగా అర్థమైంది. దీనితో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ శిరీష, ఏసిపి లక్ష్మీనారాయణ నేతృత్వంలో రంగంలోకి దిగిన ఎస్ హెచ్ఓ సిఐ నరసయ్య పరిశీలించగా జరిగిన మోసం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో అతని అకౌంట్ నుంచి రూ. 1 కోటి 47 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఇక అతని వద్ద నుంచి వ్యక్తిగతంగా రెండు



లక్షల అరవై వేలు నగదు రూపంలో స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు రెండు స్మార్ట్ ఫోన్లు కూడా పోలీసుల స్వాధీనం అయ్యాయి. మిగతా డబ్బులు అతడు షేర్ మార్కెట్లో ఖర్చు పెట్టి నష్టపోయినట్లు నిందితుడు పోలీసులకు వివరించాడు. ఇలాంటి మోసాలు ఇతని కొత్త కాదు. పోలీసుల విచారణలో అతడు గతంలో జూబ్లీహిల్స్, చందానగర్లలో పనిచేసే చోట కూడా ఇలాంటి మోసానికి పాల్పడినట్లు డిసిపి శిరీష వివరించారు. అడ్డంగా దొరికిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు డిసిపి శిరీష తెలిపారు. మీడియా సమావేశంలో కూతురు సీఐ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.





## వానాకాలం సాగుపై అవగాహన సదస్సు

**నిజామాబాద్ జిల్లా, మే 21(ప్రజాక్షేత్రం) :**

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' నినాదంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన కార్యక్రమం భీంగల్ మండలంలోని జాగిర్యాల గ్రామంలో పండుగలా సాగింది. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 30న మొదలైన ఈ అవగాహన సదస్సు మే 23 వరకు కొనసాగుతుండగా, తాజాగా జాగిర్యాల గ్రామంలో రుద్రూరు పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతులకు దిశానిర్దేశం చేశారు.

కేవలం దిగుబడి పెంచడమే కాదు మార్కెట్లో ఏ పంటకు డిమాండ్ ఉందో తెలుసుకుని సాగు చేయడమే అసలైన వ్యవసాయమని రుద్రూరు శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య రైతులకు హితవు పలికారు. విశ్వవిద్యాలయం సిఫార్సు చేసిన నాణ్యమైన విత్తన రకాలను ఎంచుకుంటేనే మార్కెట్లో గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే రసాయనాల మోతాదు తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, జీవ ఎరువులు, పంట మార్పిడి, మల్చింగ్ వంటి పద్ధతులతో నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించవచ్చని, ఇది దీర్ఘకాలంలో రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందని వివరించారు. రాబోయే వానాకాలం సీజన్‌లో రైతులు ప్రభుత్వం సూచించిన వరి రకాలను మాత్రమే సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారిణి బి. లావణ్య గారు కోరారు. ముఖ్యంగా సన్న రకాలుగా బిపిటి5204, ఆర్ఎన్ఆర్15048, కెఎన్ఎం1638, జైశ్రీరామ్, హెచ్ఎంటి, డబ్ల్యుజిఎల్962, డబ్ల్యుజిఎల్44, జెజిఎల్ 1798 వంగడాలను, అలాగే దొడ్డు రకాలుగా ఐఆర్64, ఎమ్‌టియు1010, కెఎన్ఎం118 వంగడాలను మాత్రమే వేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి ఎం. దివ్య, జాగిర్యాల గ్రామ సర్పంచ్ జి. ప్రసాద్, ఉప సర్పంచ్ భాస్కర్, పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తల సూచనలను రైతులు ఆసక్తిగా ఆలకించి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

**నిజామాబాద్ జిల్లా, మే 21(ప్రజాక్షేత్రం) :**

భీమ్‌గల్ మండలం ముచ్కూర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు బంగ్లా దేవేందర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సొసైటీ ద్వారా నిరంతరం అందుబాటులో ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బురెడీ గంగారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఏపీలో కేసు నమోదు

- **టీవీ డిబేట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని ఆరోపణ**
- **అమిత్ షా, పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలంటూ జనసేన ఫిర్యాదు**
- **కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**
- **నాగేశ్వర్‌తో పాటు సంబంధిత టీవీ ఛానెల్‌పైనా కేసు**

**హైదరాబాద్ మే 21(ప్రజాక్షేత్రం):**

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై కేసు నమోదైంది. ఓ టెలివిజన్ ఛానల్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ జనసేన కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై, సంబంధిత టీవీ ఛానెల్‌పై కేసు నమోదు చేశారు. జనసేన కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఇటీవల జరిగిన ఓ టీవీ డిబేట్‌లో నాగేశ్వర్ మాట్లాడుతూ.. గతంలో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ ఢిల్లీలో అమిత్ షాను కలిసి వైఎస్ జగన్‌ను అరెస్టు చేయాలని కోరారని పేర్కొన్నారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ, "రాజకీయాల్లో ఇన్‌స్టంట్ ఫ్రెండ్, లాంగ్ టర్మ్ ఫ్రెండ్ ఉంటారు. చంద్రబాబు ఇన్‌స్టంట్ ఫ్రెండ్ (తాత్కాలిక స్నేహితుడు), జగన్ లాంగ్ టర్మ్ ఫ్రెండ్ (చిరకాల మిత్రుడు). మనకు 25 మంది ఎంపీలతో జగన్ సహకరిస్తున్నారు కదా, మీరు కూడా వైఖరి మార్చుకోండి" అని వారికి సలహా ఇచ్చినట్లు నాగేశ్వర్ వ్యాఖ్యానించారు. అమిత్ షా అనని మాటలను అన్నట్లుగా ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా నాగేశ్వర్ వ్యాఖ్యలు ఉన్నాయని జనసేన కార్యకర్తలు తమ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపడంతో, ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై, ఆ కార్యక్రమాన్ని ప్రసారం చేసిన టీవీ ఛానెల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## సీఎం సహాయ నిధి పేదలకు వరం:పామేన భీంభరత్

**మొయినాబాద్, మే 21(ప్రజాక్షేత్రం):**

సీఎం సహాయ నిధి పేద మరియు మధ్యతరగతి ప్రజలకు వరంలా మారిందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్నగర్లో ఉన్న తన కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలు వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన అన్నారు.

రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, కంజర్ల భాస్కర్, భద్రప్ప, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాగిరెడ్డిగూడ సర్పంచ్ పద్మ సంజీవ రెడ్డి, మోత్కుపల్లి సర్పంచ్ సంపూర్ణ రాములు, గణేష్ గౌడ్, మినాజుద్దీన్, సుధాకర్ గౌడ్, మల్లేష్, దయానంద గౌడ్, చిలుకూరు ఆంధ్రూ, కౌన్సిలర్ విక్రంరెడ్డి, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్రెడ్డి, బిక్షపతి, గన్నేపాక నర్సింగ్ రావు, చిలుకూరు రాజు, వివిధ మండలాలు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



### సినిమా ఫ్లాప్ అయితే రెండు, మూడు నెలలు
## డిప్రెషన్‌లోకి వెళ్లిపోతా

ఆమిర్ ఖాన్ కొడుకు జునైద్ హీరోగా నటించిన చిత్రం 'ఏక్ దిన్'. ఇందులో హీరోయిన్‌గా సాయిపల్లవి నటించింది. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమీర్ ఖాన్ నిర్మించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య వచ్చి కేవలం యావరేజ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమీర్ ఖాన్ సినిమా విజయం సాధించకపోవడంపై ఎమోషనల్ కామెంట్స్ చేశాడు.

ఒక సినిమా ఫ్లాప్ అయినప్పుడు నేను రెండు మూడు నెలల పాటు డిప్రెషన్‌కు గురవుతాను. ఎందుకంటే సినిమా మన బిడ్డ లాంటిది. అది విజయం సాధించనప్పుడు, రిజెక్ట్ అయినప్పుడు చాలా బాధగా ఉంటుంది. ఫ్యాన్స్ అండ్ ఆడియన్స్ మన నుంచి వచ్చే ఒక మంచి కథ కోసం ఎదురుచూస్తారు. వారు మనపైన అభిమానంతో థియేటర్‌కు వెళ్తారు. కానీ ప్రేక్షకులు ఎప్పుడూ కావాలని ఒక చెడ్డ సినిమా చూడటానికి వెళ్లరు. ఒకవేళ మీకోసం వచ్చి వారు నిరాశ చెందితే.. అది కచ్చితంగా మీరు చేసిన తప్పే అవుతుంది' అంటూ చెప్పుకొచ్చాడు. అందుకే సినిమా సక్సెస్ అయితే ఎంత సంతోషంగా ఉంటుందో ఫెయిల్ అయితే అంతకన్నా ఎక్కువ బాధ పడతాం అంటూ ఆమిర్ ఖాన్ చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జోడీగా నటించిన మూవీ 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని చిత్రబృందం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీ అయిపోయిన మూవీ టీమ్ వరుస ఇంటర్వ్యూలో పాల్గొంటున్నారు. తాజాగా, బుచ్చిబాబు సనా, రామ్ చరణ్ కారులో ప్రయాణిస్తూ షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. రెజ్లర్లతో సీన్ల గురించి చెప్తూ.. ఇసుకలో, ఎండలో షూటింగ్ చేయడం చాలా కష్టంగా అనిపించలేదా అని అడగ్గా.. చరణ్ ఊహించని సమాధాన మిచ్చారు. తాను చాలా బాగా ఎంజాయ్ చేశానని.. కష్టమైన పనిని ఇష్టంగా చేస్తే ఎలాంటి అలసట రాదని చెప్పారు. అయితే కుస్తీలో చేయి పట్టి అదురు రావడంతో తన కూతురిని కూడా ఎత్తుకోలేకపోయానని ఎమోషనల్ అయ్యారు. మీరు నిజమైన పహిల్వాన్లను పెట్టారు.. వాళ్లు రియల్‌గా ఆడేస్తున్నారని తెలిపాడు. ఆడి తర్వాత సారీ చెప్పారని గుర్తు చేసుకున్నారు. ఎందుకంటే వాళ్లలో నిజమైన స్పోర్ట్స్ మ్యాన్ స్పిరిట్ అనేది వాళ్లలో ఉంటుందని.. అలాంటి వారిని యాక్టింగ్ చేయమంటే అది సాధ్యం కాదని చెప్పుకొచ్చారు. అయితే 'పెద్ది' సినిమాలో జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ వంటి స్టార్స్ నటించడం విశేషం.



## 'పెద్ది' షూటింగ్ తర్వాత నొప్పితో మా పాపను కూడా ఎత్తుకోలేకపోయా

## అందుకే స్క్రిప్ట్ చదవను

'పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' (Dragon). తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి అప్‌డేట్‌గా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 4 నిమిషాలు ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇప్పుడు రికార్డును కూడా నమోదు చేసింది.

24 గంటల్లో 'డ్రాగన్' గ్లింప్స్ 64 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకున్నట్లు టీమ్ తెలిపింది. ఇప్పటివరకూ ఇండియాలో ఏ సినిమా గ్లింప్స్‌నకు ఇన్ని వ్యూస్ రాలేదని వెల్లడించింది. ఇది ఆల్‌టైం రికార్డు అంటూ పోస్టర్ విడుదల చేసింది (Dragon Glimpse Record). ఇది కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు రావడం ఖాయమంటూ ఫ్యాన్స్ భావిస్తున్నారు.

తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ (NTR) 'డ్రాగన్'గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది.




## తొందరపడి బాధపడే కన్నా.. ఇదే మేలు!

సరైన సమయానికి జీవితంలోకి రావాల్సిన వ్యక్తి తప్పకుండా వస్తాడంటోంది బాలీవుడ్ కథానాయిక సారా అలీఖాన్. 'పతీ పత్ని ఔర్ వో దో' చిత్రంతో థియేటర్లలో ప్రేక్షకుల్ని అలరిస్తున్న ఈమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో కెరీర్‌తో పాటు పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "పెరిగిన వాతావరణం.. చుట్టూ చూసే సంఘటనల వల్ల కలిగే అనుభూతి మనలో ఎన్నో ఆలోచనలు రేకెత్తిస్తుంది. నేను ఎన్నో వివాహ బంధాలు మధ్యలోనే ముగిసిపోవడం చూశాను. అందుకే హడావుడిగా పెళ్లి చేసుకుని బాధపడే కంటే కాస్త సమయం తీసుకుని సరైన వ్యక్తి దొరికే వరకు వేచి చూడటం ఉత్తమం. పెళ్లితోనే నేను పరిపూర్ణం అవుతానను కోవడం లేదు. సొంతంగా ఎదగడానికి ప్రాధాన్యత ఇస్తాను. ప్రస్తుతం నా దృష్టి పూర్తిగా కెరీర్ పైనే ఉంది. ఈలోగా సరైన వ్యక్తి రావాలని రాసిపెట్టి ఉంటే వారే వస్తారు. పెళ్లి చేసుకోకుండా హాయిగా ఉండేందుకు నాలో చాలా లక్షణాలున్నాయి. అందుకే ఇలాంటి విషయాలలో తొందరపడకుండా ఉండడానికే ప్రయత్నిస్తాను. కొన్నిసార్లు నా సొంత ఆలోచనల్లో మునిగిపోతాను" అని చెప్పుకొచ్చింది సారా.



ప్రస్తుతం మంచి జోష్‌లో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న యువ హీరోయిన్లలో రితికా నాయక్ ఒకరు. ఈ ముద్దుగుమ్మ కొంతకాలం క్రితం వచ్చిన 'మిరాయ్' చిత్రంతో మంచి గుర్తింపు దక్కించుకుంది. ప్రస్తుతం నితిన్ హీరోగా నటిస్తున్న సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. సినిమాల్లో ఇప్పటివరకు గ్లామర్ షోకు దూరంగానే ఉన్న రితికా సోషల్ మీడియాలో కూడా చాలా కాలం వరకు అందాల ఆరబోతకు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. అయితే ఇటీవల మాత్రం తన స్టైలిష్ లుక్స్, గ్లామరస్ ఫోటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా రితికా తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. అందులో అల్ట్రా స్టైలిష్ లుక్‌లో పొట్టి స్లీవ్‌లెస్ వైట్ డ్రెస్ ధరించి హాట్ ఫోజులతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా ఆమె కిల్లింగ్ లుక్స్ అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. సోఫాపై కూర్చుని, పడుకొని వివిధ యాంగిల్స్‌లో ఇచ్చిన స్టిల్స్ మరింత ఆకర్షణీయంగా కనిపించడంతో ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## కిల్లింగ్ లుక్స్‌తో కుర్రాళ్ల మతి పోగొట్టిన రితికా నాయక్



## లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు ఇప్పటికీ ఆ సవాళ్లు తప్పడం లేదు..



బాలీవుడ్ బ్యూటీ హుమా ఖురేషి ప్రస్తుతం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక ఇందులో ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మరీ ముఖ్యంగా హుమా ఖురేషి బాలీవుడ్‌లో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు ఎదురవుతున్న సవాళ్లపై తనదైన స్టైల్లో స్పందించి అందరినీ ఆలోచింపచేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రేక్షకుల ఆలోచనలు మారుతున్నప్పటికీ, హీరోల సినిమాలకు ఇచ్చే భారీ బడ్జెట్‌లు, మద్దతు మాత్రం హీరోయిన్లు చేసే చిత్రాలకు దక్కడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. మన దేశంలో మహిళా ప్రాధాన్యత ఉన్న ఒరిజినల్ కథలను తెరకెక్కించడానికి ఎంతో అవకాశం ఉందని చెప్పారు. భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, పురాణాలను పరిశీలిస్తే ఎన్నో అద్భుతమైన కథలు దొరుకుతాయని, అందువల్ల ఇతర భాషల చిత్రాలను రీమేక్ చేయడం కంటే, మన సొంత కథలపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని అన్నారు.

లేడీ ఓరియెంటెడ్ చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల పరంగా లిమిట్స్ ఉంటాయనే పాత ఆలోచనా విధానం ఇండస్ట్రీలో ఇప్పటికీ కొనసాగుతోందని హుమా పేర్కొన్నారు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు ఇప్పటికీ ఆ సవాళ్లు తప్పడం లేదని తెలిపారు. ప్రస్తుతం తాను కూడా సరిగ్గా ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నానని చెప్పారు. హీరోల సినిమాలకు కేటాయించే అంత భారీ బడ్జెట్‌లు హీరోయిన్ల మూవీస్‌కి ఇవ్వరని, ఈ వివక్ష బయటకు కనిపించకపోయినా పరిశ్రమలో ఖచ్చితంగా ఉందన్నారు. అయితే ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం తను మాత్రమే కాకుండా, తన తోటి నటీమణులు కూడా నిరంతరం శ్రమిస్తూ, సరిహద్దులను దాటి సరికొత్త ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కాగా.. త్వరలో హుమా ఖురేషి 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. రాకింగ్ స్టార్ యష్, గీతూ మోహన్‌దాస్ కాంబోలో రాబోతున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌లో హుమా ఎలిజబెత్ పాత్రలో కనిపించనుంది. ఆమెతో పాటు నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వాని, తారా సుతారియా నటిస్తున్న ఈ మూవీ జూన్ 4న థియేటర్స్‌లోకి రాబోతోంది.

ఇండస్ట్రీకి వచ్చిన అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న వారిలో సీనియర్ నటి జ్యోతిక ఒకరు. కెరీర్‌లో పీక్స్‌లో ఉన్న టైమ్‌లో తమిళ స్టార్ సూర్యతో ప్రేమ, పెళ్లి, పిల్లలు అనంతరం.. ప్రస్తుతం వరుస అవకాశాలు అందుకున్న ఈమె తాజా ఇంటర్వ్యూలో బాలీవుడ్‌పై షాకింగ్ కామెంట్స్ చేసింది. అయితే.. ఈ అమ్మడు సౌత్‌లో స్టార్ హీరోయిన్ అవడానికి ముందే బాలీవుడ్‌లో ట్రై చేసిందట. అక్కడ 'డోలి సజాకే రఖ్నా' అనే చిత్రంతో 1998లో హిందీలోకి అడుగు పెట్టిందట ఈ అమ్మడు. అక్షయ్ ఖన్నా హీరోగా నటించిన ఈ చిత్రం అనుకున్నస్థాయిలో ఆకట్టుకోలేక డిజాస్టర్ కావడంతో జ్యోతికకు బాలీవుడ్ మరో అవకాశం ఇవ్వలేదని చెప్పుకొచ్చింది. ఆ తర్వాత తమిళంలో ట్రై చెయ్యగా.. అక్కడ కూడా ఫస్ట్ సినిమా ఫ్లాప్ అయ్యిందట. కానీ తర్వాత అక్కడ వరుస ఆఫర్లు రావడంతో.. తక్కువ కాలంలోనే తమిళ, తెలుగు, కన్నడ భాషల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన జ్యోతికకు ప్రస్తుతం హిందీలో వరుస ఆఫర్లు రావడంపై స్పందిస్తూ.. 'నేను బాలీవుడ్ చిత్రంతోనే నా సినీ కెరీర్‌ను స్టార్ట్ చేశాను. కానీ అక్కడ నా ఫస్ట్ సినిమా ఆడకపోవడంతో బాలీవుడ్ నాకు మరో అవకాశం ఇవ్వలేదు. అలాగే తమిళంలో కూడా నా ఫస్ట్ సినిమా ఆడలేదు. కానీ అక్కడ నాకు ఆఫర్లు వచ్చాయి. అదే బాలీవుడ్‌కు, తమిళంకు ఉన్నా తేడా. అయితే.. అప్పటికీ ఇప్పటికీ బాలీవుడ్‌లో చాలా మార్పులు వచ్చాయి. మహిళల కోసం ప్రత్యేకంగా కథలు రాస్తున్నారు. దక్షిణాదిలో ఇంకా ఆ దిశగా పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. ఈ లెక్కన ప్రతి ఇండస్ట్రీలో ప్లస్సులు, మైనస్సులు ఉన్నాయి' అంటూ చెప్పుకొచ్చింది. కాగా.. జ్యోతిక ప్రస్తుతం 'సిస్టమ్' చిత్రం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.



## ప్రతీ ఇండస్ట్రీలో ప్లస్సులు, మైనస్సులు ఉంటాయి..

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394